
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

7

మంగళవారం 7 మే 2024





ఆర్వోపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డాక్టర్ గోపిరెడ్డి

వైసీపీ శ్రేణుల.. హల్‌చల్



దాడిలో గాయపడిన టీడీపీ కార్యకర్తలు

నరసరావుపేట, మే 6: పోలింగ్ సమయం దగ్గరపడుతుంది.. ప్రశాంత ఎన్నికలకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసు అధికారులు ప్రకటిస్తున్నారు. స్వేచ్ఛాయుత ఓటింగ్‌కు ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల అధికారులు చెప్తున్నారు. కానీ పల్నాడులో మరోసారి వైసీపీ మూకలు బరి తెగించాయి. నరసరావుపేట పల్నాడు రోడ్డులోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ కేంద్రం వద్ద వైసీపీ శ్రేణులు హల్‌చల్ చేశాయి. వైసీపీ మూకలు కేంద్రాన్ని చుట్టుముట్టారు. పోలీసుల సాక్షిగా గంట పాటు కర్రలు.. రాళ్లతో వీరంగం వేశారు. పసుపు కండువ ధరించిన వారిని టార్గెట్ చేసి దాడిచేసి గాయపరిచాయి. భయభ్రాంతులకు గురైన కొందరు ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకోకుండానే వెనుతిరగాల్సి వచ్చింది. ఈ సంఘటలనతో పల్నాడు రోడ్డులో ఉద్రికత్త పరిస్థితుల నెలకొన్నాయి. సత్యనారాయణ రెడ్డి అనే విశ్రాంత ఆర్మీ ఉద్యోగి ఎస్ఎస్ఎన్ కళాశాలలోని ఫెసిలిటేషన్ కేంద్రానికి రాగా విశ్రాంత ఆర్మీ ఉద్యోగికి ఓటు ఉండదని అక్కడి అధికారులు చెప్పారు. ఆ తర్వాత ఆయన కేంద్రం వద్ద పోలీసులతో ముచ్చటిస్తున్నారు. ఆ సమయంలో టీడీపీ అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అక్కడకు రాగా ఆయన కారును కేంద్రం లోపలికి అనుమతించలేదు. దీంతో వాదన మొదలుకావడం, అక్కడున్న సత్యనారాయణరెడ్డి మొబైల్ ఫోన్‌పై వైసీపీ స్టిక్కర్‌ను టీడీపీ కార్యకర్తలు గమనించి మందలించి ఆ స్టిక్కర్‌ను తొలగించారు. సత్యనారాయణరెడ్డిపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారన్న సమాచారం వైసీపీ అభ్యర్థి గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి తెలిసింది. దీంతో ఆయన తన అనుచరులతో కలసి కేంద్రంలోకి ప్రవేశించారు. సత్యనారాయణరెడ్డిపై దాడి జరుగుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ఆర్వో సరోజపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ క్రమంలో కళాశాలకు ఎదురుగా ఉన్న వైసీపీ కార్యాలయం నుంచి కర్రలు, రాళ్లతో వచ్చిన వైసీపీ మూకలు కేంద్రం వద్దకు చేరి టీడీపీ శ్రేణులపై దాడులకు తెగబడ్డాయి. పసుపు కండువా ఉన్న వ్యక్తులే లక్ష్యంగా వారిపై దాడి చేసి గాయపరిచాయి. వైసీపీ మూకల దాడులతో కేంద్రం వద్ద ఓటు వేయడానికి వచ్చిన ఉద్యోగులతో పాటు పల్నాడు రోడ్డులోని సాధారణ ప్రజలు భయకంపితులయ్యారు.

నరసరావుపేట ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద ఉద్రిక్తత

- పోలీసుల సాక్షిగా టీడీపీ కార్యకర్తలపై వైసీపీ దాడి
- కారు ధ్వంసం.. పలువురికి గాయాలు ఆస్పత్రికి తరలింపు
- భయాందోళనతో ఓటు హక్కు వినియోగించుకోకుండానే వెనుతిరిగిన ఉద్యోగులు
- సత్తెనపల్లి కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ కారుపై దాడి



దాడిలో ధ్వంసమైన కారు అద్దాలు

అదే సమయంలో అటు వైపు వెళ్తున్న సత్తెనపల్లి కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ కారుపై కర్రలతో వైసీపీ మూకలు దాడిచేశాయి. అద్దాలు ధ్వంసం చేసి కారు టైర్లలో గాలితీసేశారు. గంట పాటు ఇష్టం వచ్చినట్లుగా దాడులకు తెగబడుతున్నా అక్కడకు పోలీసులు ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యారు. గాయపడిన టీడీపీ కార్యకర్తలను స్థానికులు ఆస్పత్రులకు తరలించారు.

వైసీపీ కార్యాలయం ఎదురుగానే బ్యాలెట్ కేంద్రం

పోస్టల్ బ్యాలెట్ కేంద్రం ఏర్పాటులో ఎన్నికల అధికారులు నిబంధనలు పాటించలేదు. ఏకంగా వైసీపీ ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ కార్యాలయం ఎదురుగానే కేంద్రం ఏర్పాటు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక పార్టీ కార్యాలయం ఎదురు పోస్టల్ బ్యాలెట్ కేంద్రం ఎలా ఏర్పాటు చేశారన్న ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. అక్కడ ఎప్పుడూ వందలాది మంది వైసీపీ కార్యకర్తలు ఉంటారు. పార్టీ కార్యాలయం గేటు ఎదురుగానే బ్యాలెట్ కేంద్రం గేటు ఉంది. సదరు కార్యాలయంలో కర్రలు, రాళ్లు ఎందుకు ఉన్నాయి. ఇప్పటికైనా పోస్టల్ బ్యాలెట్ కేంద్రం మార్చాలని ఉద్యోగులు కోరుతున్నారు. లేకుంటే భారీగా భద్రత కల్పించాలంటున్నారు.

ఇప్పుడే ఇలా.. పోలింగ్ రోజు పరిస్థితి?

పోస్టల్ బ్యాలెట్ కేంద్రం వద్ద ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించడంలో యంత్రాంగం విఫలమైందనేందుకు సోమవారం నరసరావుపేటలో జరిగిన ఘటనే నిదర్శనం. ఓటు గుర్తింపు స్లిప్ ఉన్నవారిని, అభ్యర్థులు, వారి ఏజెంట్లను మాత్రమే కేంద్రంలోకి అనుమతించాల్సి ఉండగా ఇందుకు విరుద్ధంగా అధికారులు వ్యవహరించినందునే ఈ ఘర్షణ చోటు చేసుకుందన్న విమర్శలు వస్తున్నాయి. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహణలో యంత్రాంగం, పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించినందునే వైసీపీ మూకలు దాడులకు తెగబడ్డాయన్న విమర్శలున్నాయి. పరిమిత ఓటర్లు ఉండే ఈ పోస్టల్ పోలింగే ఇలా నిర్వహిస్తే 13న జరిగే అసలు పోలింగ్ పరిస్థితి ఎలా ఉంటుందోనన్న భయాందోళనలు ఓటర్ల నుంచి వ్యక్తమవుతున్నాయి. పలు పోలింగ్ బూత్‌ల వద్ద ఇదేరకమైన దాడులకు తెగబడేందుకు వైసీపీ రంగం సిద్ధం చేసుకుంటుందన్న ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో పోలీసు శాఖ ఎలాంటి చర్యలు తీసుకుని ప్రశాంత ఎన్నికలు నిర్వహిస్తుందో చూడాలి.



పల్నాడు రోడ్డులో కర్రలతో వైసీపీ కార్యకర్తల వీరంగం

అరాచకాలపై ఖండన

• శ్రీకృష్ణదేవరాయలు, అరవిందబాబు

ఓటమి భయంతోనే ఓటర్లను ఇబ్బంది పెట్టే అరాచక చర్యలకు వైసీపీ నేతలు పాల్పడుతున్నారని కూటమి నరసరావుపేట ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు లావు శ్రీకృష్ణదేవరాయలు, డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలిపారు. నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెంలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగస్తులు టీడీపీ వైపే ఉండడంతో వైసీపీ నేతల్లో భయం మొదలై ప్రశాంతంగా జరుగుతున్న బ్యాలెట్ ఓటింగ్ వద్ద అలజడి సృష్టించారన్నారు. ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎస్ఎస్ఎన్ కళాశాలలోని పోస్టల్ బ్యాలెట్ కేంద్రంలోకి నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ మూకలు ప్రవేశించి లోపలే సమావేశాలు పెట్టారన్నారు. దాదాపు 30 మందికి పైగా వైసీపీకి చెందిన వ్యక్తులు ఎన్నికల కాంపౌండ్ లోపలికి ప్రవేశించారన్నారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి, ఆయన అనుచరులు టీడీపీ శ్రేణులపై దాడి చేయ డాన్ని ప్రజలు గమనించార న్నారు. ఈ ఘటనపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని కోరారు. సమావేశంలో జనసేన నేత సయ్యద్ జిలానీ పాల్గొన్నారు.



పోస్టల్ బ్యాలెట్‌కు పైసలు



- ఉద్యోగుల ఓట్లకు యమ డిమాండ్
- కొనుగోళ్లలో అధికార వైసీపీ అభ్యర్థులు
- రూ.2 వేల నుంచి రూ.7 వేల వరకు ఆఫర్
- ఉదయం నుంచే కేంద్రాల వద్ద నేతల అనుచరుల తిష్ట
- యూనియన్ నేతల ద్వారా ఉద్యోగుల ప్రసన్నానికి ప్రయత్నాలు
- ఐదేళ్లుగా జరిగిన అన్యాయంపై నేతలను నిలదీస్తున్న ఉద్యోగులు

గుంటూరు, బాపట్ల, నరసరావుపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్‌కు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఇప్పటికే పీవో, ఏపీవో, మైక్రో అబ్జర్వర్లు తమ ఓటుహక్కుని వినియోగించుకున్నారు. అయితే వీరి సంఖ్య తక్కువగానే ఉన్నది. ఎన్నికల విధుల్లో అత్యధిక సంఖ్యలో ఉండే పోలీసులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, వైద్య ఆరోగ్య శాఖ, సచివాలయాల సిబ్బందితో పాటు కాంట్రాక్టు ఉద్యోగులకు మంగళ, బుధవారాల్లో పోస్టల్ బ్యాలెట్ వినియోగించేందుకు అవకాశం ఇచ్చారు. నియోజకవర్గాల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు బారులు తీరారు. ఉద్యోగుల్లో ఎక్కువమంది ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న దృష్ట్యా వీరి ఓట్లపై వైసీపీ అభ్యర్థులు దృష్టి పెట్టారు. ఎలాగైనా ఉద్యోగులను ప్రసన్నం చేసుకుని వారి ఓటును తమకు అనుకూలంగా వేయించుకునేందుకు డబ్బు రూపంలో ప్రలోభ పెట్టేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ఆ రేటు రూ.2 వేల నుంచి రూ.7 వేల వరకు ఇచ్చేందుకు అభ్యర్థులు ముందుకు వచ్చారంటే పోస్టల్ బ్యాలెట్‌కు ఏ స్థాయిలో డిమాండ్ ఉందో తెలుస్తోంది. ఉద్యోగులను అనుకూలం చేసుకునేం దుకు మరికొందరు ఉద్యోగ సంఘ నేతలను సంప్రదించి బేరసారాలకు తెరలేపారు. ఉద్యోగులు వైసీపీకి వ్యతిరేకంగా ఉన్నారనే అంచనాల నేపథ్యంలో వారికి ఓటుకు రూ.5,000 చెల్లించాలని తాడేపల్లి పెద్దలు అభ్యర్థులకు ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. నేతల అనుచరులు పోస్టల్ బ్యాలెట్ కేంద్రాల దగ్గరే మకాం వేసి ఉద్యోగులను ప్రలోభపెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రలోభాలపై టీడీపీ నేతలు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంపై విమర్శలకు తావిస్తోంది. మరోవైపు గంపగుత్తగా ఉద్యోగుల ఓట్ల కొనుగోలుకు యూనియన్ నేతల ద్వారా వైసీపీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే యూనియన్ నేతలతో పాటు, పలువురు ఉద్యోగుల నుంచి బేరసారాలపై తిరస్కారమే ఎదురవుతుంది. ఐదేళ్లుగా వైసీపీ పాలనలో తమకు జరిగిన అన్యాయంపై నేతలను ఉద్యోగులు నిలదీయడం మొదలుపెట్టారు. తమ ప్రయోజనాలకు ప్రభుత్వం గండికొట్టి ఇప్పుడొచ్చి డబ్బు ఆశచూపితే మోసపోవడానికి తాము సిద్ధంగా లేమని తిరస్కరిస్తున్నారు. దీంతో వైసీపీ అభ్యర్థులు, నేతల్లో కలవరం మొదలైంది.

◆ బాపట్లలో సోమవారం మున్సిపల్ హైస్కూల్‌కు సమీపం లోని ఓ హోటల్‌లో వైసీపీ నేతలు పోస్టల్ బ్యాలెట్‌లకు డబ్బులు పంచుతున్నారన్న సమా చారంతో పోలీసులు తనిఖీలకు వెళ్లగా అప్పటికే అక్కడ నుంచి పలాయనం చిత్తగించారు. రేపల్లెలో వైసీపీ ఓటుకు రూ.2 వేలు పంపిణీ చేసినట్లు సమాచారం.

◆ గుంటూరు జిల్లాలో దాదాపుగా 20,775 మందికి పోస్టల్ బ్యాలెట్ ఉంది. దీంతో ఎక్కువ ఓట్లు పొందేందుకు వైసీపీ అభ్యర్థులు ప్రలోభాలకు తెరలేపారు. జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో గత ఎన్నికల్లో మంగళగిరిలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కీలకంగా మారాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని వైసీపీ అభ్యర్థులు ఓటుకు అత్యధికంగా రూ.5 వేల చొప్పున పంచుతున్నారు. గుంటూరు తూర్పు, పశ్చిమ, తెనాలి, ప్రత్తిపాడు, పొన్నూరులో రూ.2 వేలు, తాడికొండలో రూ.1,500 పంచుతున్నారని సమాచారం.

◆ పల్నాడు జిల్లాలో 19,095 మంది ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్‌లు జారీ చేశారు. వీరిలో 16,582 మంది జిల్లాలో విధులు నిర్వ హిస్తూ జిల్లాలోనే ఓటు హక్కు కలిగినవారు ఉన్నారు. ఈ సారి పోస్టల్ బ్యాలెట్ అత్యధి కంగా పెదకూరపాడు నియోజకవర్గంలో రూ.7 వేలకు వైసీపీ అభ్యర్థి నంబూరు శంకర రావు కొనుగోలు చేసినట్లు తెలిసింది. తదుపరి మాచర్లలో రూ.5 వేలకు పిన్నెల్లి కొనుగోలు చేసినట్లు సమాచారం. ఇతర నియోజకవర్గాల్లో కనీసం రూ.3 వేలకు కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

తెనాలిలో.. అరాచకాలు



- ప్రజాప్రతినిధి అండతో రెచ్చిపోతున్న రౌడీషీటర్లు
- పట్టించుకోని పోలీసులు.. భయంతో వణికిపోతున్న సామాన్యులు
- ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసి లబ్ధి పొందేందుకు వ్యూహం

గుంటూరు, మే 6: ప్రశాంతతకు నెలవైన తెనాలిలో వైసీపీ అరాచకాలతో శాంతిభద్రతలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. అధికార పార్టీ ప్రజాప్రతినిధి అండ.. పట్టించుకోని పోలీసుల తీరుతో రౌడీషీటర్లు రెచ్చిపోతున్నారు. రౌడీ షీటర్లను, పోలీసులను ఉపయోగించుకుని ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రజాప్రతినిధి ప్రయత్నిస్తుండటమే ఇక్కడ ప్రధాన సమస్యగా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ నాయకుల అండతో చెలరేగుతున్న రౌడీషీటర్ల అరాచకాలకు అంతే లేకుండా పోతుంది. గడచిన వారం రోజుల్లో జరిగిన రెండు ఘటనలు తెనాలి వాసులను ఉలిక్కిపడేలా చేశాయి. ఇందుకు సంబంధించిన వివరాలు.. గతంలో ఐతానగర్ కేంద్రంగా రౌడీషీటర్ సురేంద్ర గ్యాంగ్ సాగించిన అరాచకం తెనాలివాసులను భయాందోళనకు గురిచేసింది. స్థానిక ప్రజాప్రతినిధికి అత్యంత సన్నిహితుడి ఆగడాలు శృతిమించాయి. ప్రజల నుంచి తీవ్ర విమర్శలు, భేదాభిప్రాయాలతో కొంతకాలంగా రౌడీషీటర్ సురేంద్రను స్థానిక ప్రజాప్రతినిధి దూరం పెట్టారు. అయితే సురేంద్ర అనుచరుడైన సముద్రాల పవన్‌కుమార్ అలియాస్ లడ్డును ఆయన ప్రోత్సహిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇటీవల ఐతానగర్‌లో పట్టపగలు నడిరోడ్డుపై పవన్‌కుమార్, అతడి అనుచరుడు సాగించిన బీభత్సకాండతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. పవన్‌కుమార్ తన అనుచరుడితో బైక్‌పై వెళ్తూ మరో ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టి పడిపోగా ముందు వెళ్తున్న వాహన చోదకుడిపై దాడి చేశారు. అదే సమయంలో అటుగా వెళుతున్న ఈదర కార్తీక్ అనే వ్యక్తి సర్ది చెప్పేందుకు ప్రయత్నించగా అతడిపై కూడా దాడి చేసి విచక్షణా రహితంగా కొట్టారు. అరగంట సాగిన ఈ దౌర్జన్యకాండపై సీసీ కెమెరాలో రికార్డ్ అయిన దృశ్యాలు ప్రజలను భయాందోళనకు గురిచేశాయి. వైరల్‌గా ఈ దృశ్యాలు మారడంతో పోలీసులు పవన్‌కుమార్‌ను స్టేషన్‌కు పిలిపించారు. స్థానిక ప్రజాప్రతినిధి నుంచి ఫోన్‌తో రౌడీషీటర్‌ను వదిలేసినట్లు తెలిసింది. ఎన్నికల తరుణంలో రౌడీషీటర్ బరితెగిస్తే పోలీసులు చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న శశాంక్

విద్యార్థిని చితకబాది తప్పుడు కేసు

రౌడీషీటర్ల కంటే తాము తక్కువేమీ కాదన్నట్లుగా ప్రజాప్రతినిధి అండతో కొందరు పోలీసులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. తెనాలి వీఎస్ఆర్ కాలేజీలో డిగ్రీ విద్యార్థి శశాంక్‌కి, టూటౌన్ ఏఎస్ఐ శ్రీనివాసరావుకు మధ్య చిన్న వివాదం చోటుచేసు కుంది. ఇది కాస్తా అనేక మలుపులు తిరిగి చివరకు పోలీసులు పంతానికి పోయి ఆ విద్యార్థిపై అత్యంత కర్కశంగా వ్యవహరించడం వివాదాస్పదమైంది. నాలుగు రోజుల క్రితం చిన్నపిల్లలు ద్విచక్ర వాహనంపై వస్తుండగా చూసిన శశాంక్ వారిని హెచ్చరిస్తూ తాను పోలీస్‌నని చెప్పాడు. అదే సచయంలో అటుగా వెళ్తున్న ఏఎస్ఐ శ్రీనివాసరావు శశాంక్‌పై చేయి చేసుకున్నాడు. అంతటితో వివాదం ముగిసిందనుకున్నారు. కానీ తర్వాత రోజు పోలీసులు కాలేజి నుంచి శశాంక్‌ను జీపులో ఎక్కించుకుని స్టేషన్‌కు తీసుకెళ్లి రెండు రోజులు చిత్రహింసలకు గురిచేశారు. ఆ తర్వాత 41ఏ నోటీస్ ఇచ్చి పంపించారు. పోలీసుల దెబ్బలతో ఆ విద్యార్థి రెండు రోజుల క్రితం గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స నిమిత్తం చేరాడు. ఈ క్రమంలో వారిని పరామర్శించిన మాల యువసేన రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది పొందుగల చైతన్య మాట్లాడుతూ శశాంక్‌పై అన్యాయంగా దాడి చేసిన ఏఎస్ఐ శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు అంకయ్య, సాంబశివరావు, సీఐ సుధాకర్, హోంగార్డు నరేంద్రరెడ్డిలపై క్రిమినల్ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా బాధితుడు జరిగిన దారుణంపై ఎస్సీ కమిషన్ ఛైర్మన్‌కు ఫిర్యాదు చేశారు.



లంక దిబ్బలో దహనమైన పాలబూత్ (ఫైల్)

స్వల్ప వివాదంలో పాల బూత్ దహనం

వారం క్రితం ఐతానగర్ పరిధిలోని లంకదిబ్బలో స్వల్ప వివాదంలో మేరీ అనే మహిళకు చెందిన పాలబూత్‌కు నిప్పు పెట్టారు. రౌడీషీటర్ పవన్ కుమార్ తన బూత్‌కు నిప్పు పెట్టి జీవనాధారం దెబ్బతీశాడని బాధితురాలు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు. రౌడీషీటర్ లడ్డు గ్యాంగ్‌తోపాటు మరికొందరు సంఘ విద్రోహశక్తులుగా మారి ప్రజ లను భయభ్రాంతులకు గురి చేస్తున్నా పోలీసుల్లో చలనంలేదన్న విమర్శలున్నాయి. గతంలో రౌడీషీటర్ లడ్డును తెనాలి నుంచి బహిష్కరించేందుకు పోలీసులు ఫైల్‌ను సిద్ధం చేశారు. అయితే దీనికి స్థానిక ప్రజాప్రతినిధి మోకాలొడ్డినట్లు ఆరోపణలు వచ్చాయి.

జోరుగా గంజాయి.. సింగిల్ నెంబర్ లాటరీ

అధికార పార్టీ నేతల అండదండలతో తెనాలిలో గంజాయి మాఫియా రెచ్చిపోతుంది. వైసీపీ సానుభూతి పరులు, రౌడీషీటర్లు యథేచ్ఛగా గంజాయి వ్యాపారం సాగిస్తున్నారు. దీనిని కట్టడి చేయాల్సిన పోలీసులు మామూళ్లకు, అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి ప్రేక్షకపాత్ర వహిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఐతానగర్ కేంద్రంగా గంజాయి గుప్పుమంటుంది. గంజాయి మత్తులో యువకులు నేరాలకు పాల్పడుతున్నారు. కార్తీక్‌పై దాడి చేసిన రౌడీషీటర్ లడ్డూ, అతడి అనుచరుడు గంజాయి మత్తులో ఉన్నట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. మరోవైపు సింగిల్ నెంబర్ లాటరీలు జోరుగా రూ.లక్షల్లో సాగుతున్నాయి. అధికార పార్టీ సానుభూతిపరుడు తెనాలి కేంద్రంగా సింగిల్ నెంబర్ లాటరీ నిర్వహిస్తున్న విషయం బహిరంగ రహస్యమే. ఈ విషయం పోలీసులకు తెలిసినా నెలవారీ మామూళ్లతో చూసీచూడనట్లు ఉంటున్నా రన్న విమర్శలున్నాయి.


ప్రశాంత ఎన్నికలు సాధ్యమేనా?

తెనాలిలో రౌడీషీటర్లు, పోలీసుల తీరుతో సామాన్యుల పరిస్థితి ఏమిటనేది చర్చనీయాంశంగా మారింది. అందులోనూ ఎన్నికల తరుణంలో రౌడీలు, పోలీసులు రెచ్చిపోతుంటే ప్రశాంత ఎన్నికలపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2019 ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లోనూ ఐతానగర్‌లోని స్కూల్ పోలింగ్ బూత్‌లో ఇతర పార్టీ ఏజంట్లను బయటకు నెట్టి రిగ్గింగ్ చేసుకున్నారనే ఆరోపణలున్నాయి. కాగా త్వరలో జరగనున్న ఎన్నికల్లో కూడా అదేపరిస్థితి పునరావృతమయ్యే అవకాశాలు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మనసంతా చేనేత

- మోదీని చేనేత కండువాతో సత్కరించిన లోకేశ్
- హర్షం వ్యక్తం చేస్తున్న మంగళగిరి చేనేతలు

మంగళగిరి, మే 6: ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఎక్కడ పర్యటిస్తున్నా.. ఆయన మనసంతా మంగళగిరి.. చేనేతలతోనే ఉందనేందుకు సోమవారం జరిగిన ఘటనే ఉదాహరణ. మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేస్తున్న లోకేశ్ వారం రోజులుగా యువగళం సభలతో బిజీగా ఉంటున్నారు. తాజాగా సోమవారం రాజమహేంద్రవరంలో జరిగిన ప్రధాని నరేంద్రమోదీ సభలో మంగళగిరి చేనేతకు పెద్దపీట వేశారు. ప్రధాని మోదీకి మంగళగిరి చేనేత కండువాను కప్పి సత్కరించి చేనేతలపై తన ప్రేమను లోకేశ్ చాటుకున్నారు. తమపై లోకేశ్ చూపుతున్న అభిమానం, ప్రత్యేక శ్రద్ధపై మంగళగిరి చేనేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మంగళగిరి చేనేతలకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యం కల్పించి, ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చాలన్న ఉద్దేశంతో మంగళగిరిలో లోకేశ్ వీవర్‌శాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ ఆధునిక మగ్గాలపై చేనేతలకు శిక్షణ ఇవ్వడంతో పాటు టాటా సంస్థతో ఒప్పందం చేసుకుని, మంగళగిరి చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ సౌకర్యం కూడా కల్పిస్తున్నారు. మంగళగిరిలో ప్రస్తుతం సుమారు వెయ్యిలోపు ఉన్న చేనేత మగ్గాలను ఐదు వేలకు పెంచి చేనేతల జీవన స్థితిగతులను మెరుగుపరచడమే లక్ష్యమని ప్రకటించి ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. ఇందుకు లోకేశ్‌తల్లి భువనేశ్వరి, భార్య బ్రాహ్మణి సైతం తమ వంతు సహకారం అందిస్తున్నారు.



ప్రధాని మోదీకి చేనేత కండువాను కప్పుతున్న నారా లోకేశ్

వైసీపీ నేతల బరితెగింపు

● ఎన్నికల కోడ్ ఉల్లంఘన ● రహదారి నిర్మాణానికి మట్టితరలింపు


దాచేపల్లి 1వ వార్డులో రహదారి నిర్మాణానికి తోలిన మట్టి

దాచేపల్లి, మే 6: దాచేపల్లిలో యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరుగుతోంది. రహదారి నిర్మాణంకోసం ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. పోలీసు, నగరపంచాయతీ కమిషనర్, స్పెషల్ స్క్వాడ్ బృందాలకు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చినా ఎటువంటి సమాధానం ఇవ్వలేదని టీడీపీ నేతలు ఆరోపించారు. వివరాల్లోకి వెళ్తే దాచేపల్లి నగర పంచాయతీలోని 1వ వార్డు పరిధిలో దూదేకుల వారి బజారులో రహదారి నిర్మాణానికి ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించి రోడ్డుపై పోసి చదునుచేస్తున్నారు. దీనికితోడు 1,2,3 వార్డుల్లో పనిచేస్తున్న కొంతమంది వలంటీర్లు ఇంటింటికి తిరిగి వైసీపీ వస్తేనే ప్రభుత్వ పథకాలు కొనసాగుతాయని, టీడీపీ వస్తే పథకాలు నడవవని ప్రజలను మభ్యపెడుతున్నారని స్థానికుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. ఇదే విషయంపై స్థానిక టీడీపీ నేతలు వలంటీర్లను ప్రశ్నిస్తే తాము రాజీనామా చేశామంటూ దురుసుగా సమాధానం చెబుతున్నారు. ఎవరు రాజీనామా చేశారో లిస్టు కావాలని ఎంపీడీఓను వివరాలు అడిగితే ఆ వివరాలు కూడా మాకు చెప్పడం లేదని టీడీపీ నేతలు పేర్కొన్నారు. వైసీపీ నేతలకు ఒక నీతి, టీడీపీ నేతలకు మరొక నీతిగా మారిందని స్థానికుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి.

జగన్‌ను ఇంటికి పంపేందుకు మాదిగలు సిద్ధం

● ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులన్నీ దారి మళ్లించారు

● ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్

దాచేపల్లి, మే 6: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని ఇంటికి పంపించేందుకు మాదిగలంతా సిద్ధంగా వున్నారని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు రుద్రపోగు సురేష్ తెలిపారు. సోమవారం దాచేపల్లిలోని టీడీపీ కార్యాలయంలో సురేష్ మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో అరాచకత్వం, అక్రమాలు మినహా అభివృద్ధి జాడేలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులన్నీ దారి మళ్లించారని ఆరోపించారు. మాదిగలకు ఎస్సీ వర్గీకరణ ముఖ్యమని, దీనికి జగన్మోహన్‌రెడ్డి వ్యతిరేకమని తెలిపారు. ఇంటింటికి తాగునీటి పైపులు ఇస్తామన్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి వేసవిలో గుక్కెడు నీరు లభించక దళిత బిడ్డలు ఇబ్బంది పడుతుంటే ట్యాంకర్ల ద్వారా నీటిని పంపించడం కూడా కష్టంగా వుందని ఫిర్యాదు చేశారు. రానున్న ఎన్నికలలో మాదిగలంతా సంఘటితమై వైసీపీని ఓడించాలని, టీడీపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాతంగి సత్యానందం, బాబు మాదిగ, కోటేశ్వరి, చిలుముల దుర్గారావు, సుందరరావు, వేల్పుల ముత్తయ్య, పత్రా విజయ్ పాల్గొన్నారు.

మద్యం, నగదు సీజ్

గుంటూరు(తూర్పు), మే6: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో భాగంగా మంగళగిరి, తెనాలి, తాడికొండ నియోజకవర్గ పరిధిల్లో రూ.3,05,400, రూ.1,00,000 నగదు, గుంటూరు తూర్పులో రూ.34,110 నగదు, రూ.7,480 విలువగల 10.7 లీటర్ల మద్యం సీజ్ చేసినట్టు అధికారులు తెలిపారు. మే 6వ తేది సాయంత్రం 6 గంటల వరకు రూ.3,17,17,881 విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేసినట్టు పేర్కొన్నారు.

రాష్ట్ర భవిష్యత్ కోసం కూటమిని ఆశీర్వదించండి

● ఐదేళ్లు అండగా నిలబడతాం

● శ్రీకృష్ణదేవరాయలు, అరవింద్ బాబు

నరసరావుపేటరూరల్, మే6: రాష్ట్ర భవిష్యత్తు కోసం ఎన్డీఏ కూటమి అభ్యర్థులుగా పోటీ చేస్తున్న తమని ఆశీర్వదిస్తే ఐదేళ్లు అండగా నిలబడతామని నరసరావుపేట ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు లావు శ్రీకృష్ణ దేవరాయలు, డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. సోమవారం నరసరావుపేటరూరల్ మండలంలోని.. రావిపాడు, అల్లూరివారిపాలెం, అరవపల్లి, పెట్లూరివారిపాలెం, కాకాని, కోటప్పకొండ, యక్కలవారిపాలెం, గోనెపూడి, చింతలపల్లి, యలమంద గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రేపు జరగబోయే మంచిని మాత్రమే గుర్తుంచుకోవాలని, ఎటువంటి ప్రలోభాలకు లొంగొద్దని, భయభ్రాంతులకు గురవద్దని కోరారు. పల్నాడులో రైతులకు మేలు జరగాలంటే గోదావరి జలాలను సాగర్ కుడికాల్వకు తెచ్చుకోవాలని, ఈ ప్రాజెక్టుకు ఇప్పటికే చంద్రబాబునాయుడు శంకుస్థాపన కూడా చేశారని అన్నారు. జల్‌జీవన్‌మిషన్ ద్వారా ప్రతి ఇంటికి నీరు అందించేందుకు పల్నాడుకి రూ.500 కోట్లు మంజూరు అయ్యాయని, తాము అధికారంలోకి రాగానే.. నిధులు సమర్థంగా వినియోగించుకొని ప్రతి ఇంటికి కుళాయి ఏర్పాటు చేస్తామన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో పేదవాని జీవన దశ దిశ మార్చబోతున్నామని అన్నారు.


రావిపాడు ఎన్నికల ప్రచారంలో లావు శ్రీకృష్ణ దేవరాయలు, అరవిందబాబు


బీసీల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న లావు శ్రీకృష్ణ దేవరాయలు

బీసీలను ఆర్థికంగా, సామాజికంగా ముందుకు తీసుకెళ్తాం..

బీసీ సామాజికవర్గానికి గడిచిన ఐదేళ్లలో పదవులు అలంకారానికేతప్ప, అధికారాలు శూన్యమని కూటమి నరసరావుపేట ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు లావు శ్రీకృష్ణదేవరాయలు, డాక్టర్ చదలవాడ అరవింద బాబు, జనసేన ఇన్‌చార్జి సయ్యద్ జిలాని అన్నారు. సోమవారం నరసరావుపేట మండలం, రావిపాడు గ్రామంలో యాదవుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టీడీపీ బీసీల పార్టీ అని, గడిచిన కాలంలో వారి సంక్షేమాన్ని కృషిచేసింది టీడీపీయేనని అన్నారు. బీసీ కార్పొరేషన్లకు పూర్వ వైభవం తీసుకొస్తామని, నిధులు కేటాయించి, వారికి సముచిత గౌరవాలు కల్పిస్తామని అన్నారు. బీసీ డిక్లరేషన్ రక్షణ చట్టంతో వారికి కవచంలా పనిచేస్తామని అన్నారు. గడిచినకాలంలో పల్నాడులో బీసీలపై దాడులు జరిగాయని, చంద్రయ్యను అమానుషంగా హత్యచేసిన ఘటనలు చూసామని.. ఇలాంటి పరిస్థితులను మార్చి ప్రశాంత వాతావరణాన్ని తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు పాల్గొన్నారు.

మా ఓటు ఎక్కడ?

● గందరగోళంలో పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు

● బ్యాలెట్ పంపలేదంటూ సొంత నియోజకవర్గంలోనే వేయాలని ఆర్వో వెల్లడి


ఓటు వేసేందుకు వచ్చిన పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు

పెదకూరపాడు, మే 6: పెదకూరపాడులో సోమవారం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జరిగింది. సుమారు 50 నుంచి 70 మంది ఓటర్లు ఓటు వేయకుండానే వెనుదిరిగి వెళ్ళారు. పెదకూరపాడు నియోజకవర్గంలో ఉద్యోగాలు చేస్తూ వివిధ జిల్లాలకు చెందిన వారికి పెదకూరపాడులోని జడ్పీ హైస్కూల్లో ఓటు వేసేందుకు అవకాశం ఉందని తొలుత సంబంధిత అధికారులు వివరించారు. సుదూర ప్రాంతాల నుంచి మండు వేసవిలో ఓట్లు వేసేందుకు గంటల తరబడి బారులు తీరి ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఫారాలు పూర్తి చేసి బ్యాలెట్ తీసుకోబోయే సమయానికి మీ ఓటు ఉన్న నియోజవర్గం నుంచి రిటర్నింగ్ అధికారి మీ బ్యాలెట్ పంపించలేదని, మీకు ఓటు ఉన్న నియోజక వర్గం వెళ్ళి ఓటు వేసుకోవాలని సంబంధిత అధికారులు చెప్పారు. 5వతేదీ కొంత మంది ఓటర్లు గుంటూరు, మంగళగిరి తదితర ప్రాంతాల్లో ఓట్లు వేసేందుకు క్యూలో గంటల తరబడి ఉండి తీరా ఓటు వేసే సమయానికి ఇక్కడ కాదు మీరు ఓట్లు వేసేది మీరు ఉద్యోగంచేసే చోటే వేయాలని చెప్పటంతో సోమవారం పెదకూరపాడు వచ్చినట్టు పలువురు ఆంధ్రజ్యోతికి తమ బాధను వెలుబుచ్చారు. ఈ ఓటర్లలో గర్భిణిలు కూడా ఉన్నారు. వారి ఓటు సొంత నియోజక వర్గంలోనా లేక ఉద్యోగం చేసే పెదకూరపాడు నియోజక వర్గంలోనా అనే విషయంపై అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు.

232 మంది హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన


యాత్రికుడికి వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

గుంటూరు (మెడికల్), మే 6: గుంటూరు, బాపట్ల జిల్లాల నుంచి హజ్ యాత్రకు వెళుతున్న 232 మంది ముస్లిం యాత్రికులకు సోమవారం గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి శుశ్రుతహాల్‌లో ప్రత్యేక వ్యాక్సినేషన్ శిబిరం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి శిబిరాన్ని సందర్శించి వ్యాక్సినేషన్ నిర్వహణలో వైద్య సిబ్బందికి తగిన సూచనలు చేశారు. గుంటూరు, బాపట్ల జిల్లాల వ్యాధి నిరోధక టీకాల అధికారులు డాక్టర్ కేవీ సుబ్బరాజు, డాక్టర్ టీ వెంకటేశ్వర్లు శిబిరాన్ని పర్యవేక్షించారు.


సమావేశంలో బీసీ నేతలతో కలసి ఐక్యత చాటుతున్న కేశన శంకరరావు

వైసీపీ పాలనలో బీసీలపై పెరిగిన దాడులు

● కూటమి అభ్యర్థుల విజయానికి బీసీ సంఘాలు కృషి

పొన్నూరుటౌన్, మే6: వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో బీసీలపై దాడులు, దౌర్జన్యాలు, విచ్చలవిడిగా పెరిగాయని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశన శంకరరావు ఆరోపించారు. సోమవారం చింతలపూడి డీవీసీ కళ్యాణ మండపంలో బీసీ సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. బీసీ సంఘాలు కూటమి అభ్యర్థుల విజయానికి పాటుపడాలని సమావేశంలో తీర్మానించారు. అనంతరం జరిగిన సమావేశంలో శంకరరావు మాట్లాడుతూ ఎన్నికలలో జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, పెమ్మసాని చంద్రశేఖర్‌ల విజయానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బడుగు బలహీన వర్గాలపై దాడులు దౌర్జన్యాలు పెరిగాయన్నారు. చెరుకుపల్లి వద్ద అమర్నాద్ గౌడ్ అనే బాలుడు, పల్నాడులో చంద్రయ్య హత్యలు అత్యంత కిరాతకమని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల యువత అధ్యక్షుడు కె.క్రాంతి కుమార్, అన్నం నాగమల్లేశ్వరరావు, బొర్రు రామారావు, తోట నాగరాజు, షేక్ షఫ్రూద్, బొర్రు సాంబశివరావు తదితర బీసీ నేతలు పాల్గొన్నారు.

భార్యను రోకలిబండతో కొట్టి చంపిన భర్త

పెదకాకాని, మే6: భార్యను రోకలిబండతో కొట్టి హతమార్చిన ఘటన మండలంలోని తక్కెళ్ళపాడు ఎస్సీ కాలనీలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గాంధీనగర్‌కు చెందిన పెనుమాల ఏడుకొండలు, అంజమ్మ (45) భార్యాభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు. ఏడుకొండలు కొద్దికాలంగా భార్య ప్రవర్తనపై అనుమానంగా ఉంటూ గొడవపడేవాడు. ఈ క్రమంలో ఆదివారం భార్యాభర్తల మధ్య స్వల్ప ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో ఏడుకొండలు రోకలి బండతో అంజమ్మ తలపై కొట్టాడు. తీవ్ర రక్తస్రావమైన ఆమె అక్కడ పడిపోయింది. కొద్ది సమయానికి తన కొడుకు విజయ్ ప్రకాష్ వచ్చి గమనించగా తల్లిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు. మార్గమధ్యంలోనే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఏడుకొండలు పోలీస్ స్టేషన్‌కి వెళ్లి లొంగి పోయినట్లు తెలిసింది.

దాడులతో భయపడబోం..

● ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు బ్రహ్మారెడ్డి పరామర్శ


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న బ్రహ్మారెడ్డి

మాచర్లటౌన్, మే 6: పిన్నెల్లి సోదరులు మాచర్ల పట్టణంలో రౌడీ మూకలను ఉసిగొల్పి టీడీపీ నేతలపై దాడులు చేయిస్తూ భయానక వాతావరణం సృష్టిస్తున్నారని కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి వైసీపీ రౌడీమూకల దాడిలో గాయపడి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న మాజీ కౌన్సిలర్ మంజుల వెంకటేశ్వర్లు కుమారుడు కేశవను ఆయన పరామర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్‌ను జరగకుండా అడ్డుకోవాలనేది వారి వ్యూహమన్నారు. ప్రజలంతా వారి దుర్మార్గానికి వ్యతిరేకంగా ఓట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ముందస్తు వ్యూహంలో భాగంగా పోలింగ్ శాతం తగ్గించేందుకు వైసీపీ నేతలు కుట్రలు పన్నుతూ వరుస దాడులకు తెగబడ్డారని ఆరోపించారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా ప్రజలు కచ్చితంగా కూటమి అభ్యర్థులకు ఓటు వేసి ఈ దుర్మార్గాలకు చరమగీతం పాడతారన్నారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరుమామిళ్ల మధుబాబు మాట్లాడుతూ దాడులకు వెరసేది లేదని, నమ్ముకున్న వారి కోసం తాము అండగా ఉంటామని అన్నారు. పరామర్శించిన వారిలో జూలకంటి శ్రీనివాసరెడ్డి, యెనుముల కేశవరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, బండారు నాగేశ్వరరావు, బండ్ల శ్రీను, కొమెర శివ, జల్లెల కొండలు తదితరులు ఉన్నారు.

ఐదుకోట్ల మంది ఆత్మగౌరవం అమరావతి

● 1602వ రోజుకు రైతుల ఆందోళనలు


వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్లూరు, మే 6: ఎడారి, శ్మశానం, ముంపు అంటూ వైసీపీ పాలకులు రాష్ట్ర రాజధాని అమరావతిపైన విషం చిమ్మారని అటువంటి పార్టీ ఓటు వేయవద్దని రాజధాని నిర్మాణానికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు రాష్ట్ర ప్రజలను వేడుకున్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్, మూడు రాజధానులు వద్దు అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న ఆందోళనలు నిరసన దీక్షలు సోమవారం నాటికి 1602వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి పలువురు రైతులు, మహిళలు మాట్లాడారు. ఐదు కోట్ల మంది ఆంధ్రుల ఆత్మ గౌరవమే అమరావతి అని స్పష్టం చేశారు. వైసీపీని శాశ్వతంగా ఇంటికి పంపితేనే రాష్ట్రానికి మేలు జరుగుతుందన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి రాజధాని గ్రామాల్లో నినాదాలు చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	150, 159,170
చికెన్ విత్ స్కిన్	286.00
చికెన్ స్కిన్ లెస్	296.00

మద్యం కేసుల వివరాలు..

మా ఇష్టం వచ్చినపుడు చెబుతాం

● సమాచారం అడిగినందుకు విలేకరులపై సెబ్ సీఐ దురుసు ప్రవర్తన


విలేకరులపై దురుసుగా ప్రవర్తిస్తున్న సెబ్ సీఐ వెంకటరమణ, ఎస్ఐ రవికుమార్

గురజాలటౌన్, మే 6: సెబ్ స్టేషన్ గురజాల పరిధిలో ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం అమ్ముతూ లేదా పంపిణీ చేస్తూ పట్టుబడుతున్న కేసుల వివరాలు మీడియాకు ఎందుకు తెలపడం లేదని సోమవారం గురజాల సెబ్ సీఐ వెంకటరమణను విలేకరులు ప్రశ్నించారు. తమకు వచ్చినప్పుడు లేదా కుదిరినప్పుడు సమాచారం ఇస్తామంటూ సీఐ వెంకటరమణ విరుచుకుపడ్డారు. మీడియాకు చెప్పేంత సమయం లేదు.. సమయం వచ్చినప్పుడు చెబుతాం అంటూ ఆగ్రహించారు. అక్కడే ఉన్న ఎస్ఐ రవికుమార్ కూడా విలేకరులపై దురుసుగా మాట్లాడుతూ అసలెందుకు సమాచారం చెప్పాలంటూ కస్సుర చేశారు. గురజాల సెబ్ కార్యాలయం వైసీపీ నేతలతో ఎప్పుడూ కిటకిటలాడుతోంది. రోజూ వైసీపీ నేతలు సెబ్ కార్యాలయానికి ఎందుకు వస్తున్నారు.. అక్రమ మద్యం కేసులో పట్టుబడిన వారిని రక్షించడానికే వస్తున్నారంటూ విమర్శలు వెలువెత్తుతున్నాయి. స్టేషన్ పరిధిలో వందల కొద్దీ మద్యం బాటిళ్ల పట్టుకున్నా మీడియాకు సమాచారం ఇవ్వకుండా గోప్యంగా ఉంచుతున్నారు. మద్యం పట్టుకొని లంచాలు తీసుకొని వదిలేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పట్టుబడిన అక్రమ మద్యం కేసు వివరాలను గోప్యంగా ఉంచిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

73,776 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 78,010 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 73,776 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 52,483 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8500	18000
నెంబరు. 5	9000	12000
273	12500	13000
341	8500	16000
4884	9000	14500
సూపర్ 10	–	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20000
బ్యాడిగి	9000	16000
దేవనూరు డీలక్స్	9000	16000
తెల్లకాయలు	5000	11500


హెలీప్యాడ్‌ను ధ్వంసం చేసినవారు కాపు ద్రోహులే ..


మాట్లాడుతున్న టీడీపీ కాపు సంఘం నాయకులు

పొన్నూరుటౌన్, మే6: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పొన్నూరు పర్యటనను అడ్డుకోవటానికి హెలిప్యాడ్‌ను తవ్వి ధ్వంసం చేసిన వారు కాపు ద్రోహులేనని కాపు సంఘం నాయకుడు మండిపడ్డారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో కాపు సంఘం నాయకులు మాట్లాడుతూ వైసీపీ మూకలు అడ్డంకులు సృష్టించాలని ప్రత్నించటం దారుణం అన్నారు. అయినప్పటికి జనసైనికులు టీడీపీ, బీజేపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పవన్ కళ్యాణ్ పర్యటనను విజయవంతం చేయటం వైసీపీకి చెంపపెట్టు అన్నారు. అంబటి మురళీ, కిలారి రోశయ్య కాపులను మోసం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. కాపు ముసుగులో వచ్చిన మోసగాళ్లను దరిచేరనీయవద్దని ప్రజలను హెచ్చరించారు. కాపు కులాన్ని అడ్డంపెటుకొని రాజకీయాలు చేయవద్దని హితవు పలికారు. సమావేశంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆకుల సాంబశివరావు, యరసారి శ్రీరామమూర్తి, తోట ప్రసాద్, కత్తుల రవి కిరణ్, రాజేష్, తోట శ్రీను, సాయిబాబు, సాయికుమార్ పాల్గొన్నారు.

హత్య కేసులో భార్య, ప్రియుడు సహా నలుగురు అరెస్టు

● వివాహేతర సంబంధంతో ఘాతుకం ..


హత్య కేసు నిందితులు

గుంటూరు, మే 6: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో ప్రియుడు, అతని అనుచరులతో కలసి భార్య కట్టుకున్న భర్తనే కడతేర్చింది. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్టుచేసి, రిమాండుకు తరలించారు. ఈ మేరకు సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొత్తపేట సీఐ అన్వర్ బాషా నిందితులను మీడియా ఎదుట హాజరుపరిచి వివరాలు వెల్లడించారు.

ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం ఆర్.ఉమ్మడివరం గ్రామానికి చెందిన కుక్కమూడి ప్రేమ్ కుమార్(35) తన భార్యా పిల్లలతో బతుకుతెరువు నిమిత్తం గుంటూరు వచ్చి బుచ్చయ్యతోట ఒకటో లైన్‌లో నివాసం ఉంటున్నాడు. అతను మార్కెట్లో పండ్ల వ్యాపారం చేస్తూ ఉండేవాడు. అతని భార్య భారతి సమోసాలు తయారు చేసే షాపులో పనికి వెళుతుంటుంది. ఈ క్రమంలో సదరు షాపు యజమాని షేక్ గౌస్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయం భర్త ప్రేమ్‌కుమార్‌కు తెలిసింది. దీంతో ప్రేమ్‌కుమార్‌కు, భారతికి మధ్య గొడవలు జరుగుతున్నాయి. తమ వివాహేతర సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని, ఆయనను అడ్డు తొలగించుకోవాలని భార్య భారతి భావించింది. దీంతో ప్రియుడు గౌస్‌తో కలసి భర్త ప్రేమ్‌కుమార్ హత్యకు పథకం రూపొందించింది. దీనిలో భాగంగా గౌస్, తన తమ్ముడు ఖాసిం, అతని స్నేహితుడు రెహ్మాన్‌లు కలసి ప్రేమ్‌కుమార్‌ను హత మార్చాలని నిర్ణయించుకున్నారు. గత నెల 28న రాత్రి మాయమాటలు చెప్పి కొర్నెపాడు పరిధిలో ఉన్న జగనన్న కాలనీ అర్బన్ లే అవుట్ వద్దకు తీసుకువెళ్ళి అక్కడ ప్రేమ్ కుమార్‌కు మద్యం త్రాగించి, అనంతరం ఒక కర్ర తో అతనిని వెనుక నుండి కొట్టి, తరువాత వారి వెంట తెచ్చుకున్న కత్తులతో ప్రేమ్ కుమార్ గొంతు కోసి చంపారు తరువాత భారతితో తన భర్త కనబడటం లేదని కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇప్పించారు. దీంతో ప్రేమ్‌కుమార్ మృతదేహాన్ని గుర్తుపట్టి, పంచనామా చేసి, హత్యకు ఉపయోగించిన ఆయా ఆయుధాలను స్వాధీన పరచుకున్నట్లు సీఐ అన్వర్‌బాషా తెలిపారు. దర్యాప్తు అధికారి అయిన ట్రాఫిక్ డీఎస్పీ వివి నాయుడు ఆధ్వర్యంలో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ అన్వర్ బాషా తెలిపారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



పెమ్మసాని, గల్లా రామచంద్రరావు సమక్షంలో టీడీపీలో చేరిన మొయినుద్దీన్

వైసీపీ ప్రభుత్వానికి కాలం చెల్లింది

● పెమ్మసాని సమక్షంలో టీడీపీలో చేరిన లాయర్ మొయినుద్దీన్

గుంటూరు, మే 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వానికి కాలం చెల్లిందని, రాబోయే కాలం టీడీపీదేనని, ప్రజలంతా టీడీపీ ఆగమనాన్ని స్వాగతిస్తున్నారని గుంటూరు పార్లమెంటు కూటమి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని పెమ్మసాని కార్యాలయంలో సోమవారం పెమ్మసాని, గల్లా రామచంద్రరావు సమక్షంలో వైసీపీ నాయకుడు, శాప్ మాజీ డైరెక్టర్, అంజుమన్ సంస్థ మాజీ అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది మొయినుద్దీన్ టీడీపీలో చేరారు. పెమ్మసాని ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ ప్రజలు జగన్ ప్రభుత్వంపై విసిగిపోయి ఉన్నారని, టీడీపీకి ఓటు వేసే అవకాశం ఎప్పుడెపుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నారని తెలిపారు. అనంతరం మొయినుద్దీన్ మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో టీడీపీకి, పెమ్మసానికి మెజారిటీ ఓట్లు పడేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యావంతుడు, గుణశీలి అయిన పెమ్మసాని వంటి నాయకుడి నాయకత్వంలో ప్రజలకు మేలు జరుగుతుందనే నమ్మకంతో టీడీపీలో చేరానని ఆయన చెప్పారు. మాజీ కార్పొరేటర్ గంట పెద్దబ్బాయి, గుంటుపల్లి శేషగిరిరావు సమక్షంలో జరిగిన చేరికల్లో మొయినుద్దీన్‌తో పాటు ఎస్ఎస్ పీరన్ ఉన్నారు.

తెలుగుజాతిని విశ్వవిజేతలుగా నిలిపిన చంద్రబాబు

● చంద్రబాబు ఎక్స్ వో పుస్తకావిష్కరణలో వక్తలు

గుంటూరు(తూర్పు), మే 6 : తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని ఎన్టీఆర్ కాపాడితే, దానికి ఆత్మవిశ్వాసాన్ని జత చేసి తెలుగుజాతిని విశ్వవిజేతలుగా నిలపడానికి చంద్రబాబునాయుడు నిరంతరం కృషి చేస్తున్నాడని పలువురు సాహితీవేత్తలు, టీడీపీ నాయకులు కొనియాడారు. అమరావతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ సీనియర్ జర్నలిస్టు శాఖమూరు శ్రీనివాస ప్రసాదు రచించిన 'చంద్రబాబు ఎక్స్‌వో- అనంత భావజాలికుడు' పుస్తకావిష్కరణ సభ సోమవారం గుంటూరు అరండల్‌పేట లోని ఓ హోటల్లో జరిగింది. ముఖ్య అతిథిగా ఏపీ రేరా మాజీ ఛైర్మన్ వెలమాటి రామనాథ్ హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. మరో అతిథి, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ డాక్టర్ వేపాడ చిరంజీవిరావు పుస్తక పరిచయం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగాల కోసం వెంపర్లాడే స్థితి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి తెలుగుజాతి ఎదగడం చంద్రబాబు దార్శనికత ఫలితమేనని తెలిపారు. విజన్-47 గురించి ప్రణాళికలు ఇప్పటికే సిద్ధం చేసిన నిత్య కృషీవలుడు చంద్రబాబు అని కొనియాడారు. ముఖ్యంగా ప్రపంచంలోనే తొలి బహుజన రాజధానికి బీజం వేసిన గొప్ప వ్యక్తి చంద్రబాబు అని గుర్తు చేశారు. ఈ పుస్తకాన్ని రాజకీయ కోణంలో కాకుండా ఒక గొప్ప భవిష్యత్తు దార్శనికుని జీవనయానంలోని ప్రస్తుత సమాజానికి, మానవాళికి ఉపయుక్తమైన సంఘటనల సమాహారంగా పరిగణించాలని కోరారు. సభలో టీడీపీ నాయకులు నిమ్మల శేషయ్య, తాడిశెట్టి మురళి మోహన్, రావి వెంకటరమణ, భీమినేని వందనాదేవి, పయినీర్ సంస్థ ఛైర్మన్ చుక్కపల్లి రమేష్ పాల్గొని ప్రసంగించారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అమరావతి ఫౌండేషన్ అధ్యక్షుడు కొండవీటి నరసింహారావు, పెద్ది సాంబశివరావు, ప్రముఖ ఆడిటర్ ఈశ్వరరావు, లంకా మాధవి పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, ఏపీ రెరా మాజీ ఛైర్మన్ వి.రామానాథ్ తదితరులు

పోలింగ్ రోజు సమన్వయంతో విధులు నిర్వహించాలి

● కమిషనర్, ఆర్వో కీర్తి చేకూరి

గుంటూరు(కార్పొరేషన్), మే 6 : ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల పాటిస్తూ పోలింగ్ రోజు సమన్వయంతో విధులు నిర్వహించాలని గుంటూరు నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్వో) కీర్తి చేకూరి తెలిపారు. ఏసీ కాలేజీలో రెండో రోజులుగా జరుగుతున్న తూర్పు నియోజకవర్గ పీవోలు, ఏపీవోలు, మైక్రో అబ్జర్వర్లకు జరుగుతున్న శిక్షణను సోమవారం పరిశీలించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్వో కీర్తి చేకూరి మాట్లాడుతూ ఎన్నికల విధులను వివిధ బృందాలు సమన్వయంతో చేపడితే పోలింగ్ విజయవంతంగా జరుగుతుందని, పోలింగ్‌కి సంబంధించి అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోలింగ్‌కి ముందే మాక్ పోలింగ్ చేపట్టాలని, మాక్ పోలింగ్‌లో అభ్యర్థుల ఏజెంట్లు ఉండేలా చూడాలన్నారు. ఈవీఎం కవర్లు, స్ట్రాట్యుటరీ కవర్లు, అందులో ఫైల్ చేయాల్సిన డాక్యుమెంట్లు తదితర అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. శిక్షణలో భాగంగా డెమో ఈవీఎంల కమిషనింగ్ చేయిస్తారని, పోలింగ్ రోజు ఏ సమస్య వచ్చినా తక్షణం ఉన్నతాధికారులు దృష్టికి తీసుకురావాలని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

● ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖాజీవలీ

గుంటూరు(తూర్పు), మే 6 : క్లిష్టమైన పరిస్థితిలో ఉన్న రాష్ట్రాన్ని కాపాడాలంటే చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖాజావలీ అన్నారు. ఎన్డీయే కూటమిని గెలిపించాలని కోరుతూ సోమవారం పశ్చిమ నియోజకవర్గ పరిధి, నల్లచెరువులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీల కోసం ప్రత్యేక గురుకుల పాఠశాలలను ప్రారంభించిన ఘనత చంద్రబాబుదేనని గుర్తు చేశారు. ముస్లిం యువతకు వడ్డీ లేకుండా రూ.5 లక్షల రుణం, హజ్ యాత్రికులకు సబ్సిడీ ఇస్తానని మేనిఫెస్టోలో చంద్రబాబు పొందుపరిచారని వివరించారు. అంతేగాకుండా గతంలో అమలు చేసిన షాదీ తోఫా, అంబేద్కర్ విదేశీ విద్య పథకాలను పునరుద్ధరిస్తారని, దీంతో ముస్లిం, మైనార్టీలకు మేలు జరుగుతుందని తెలిపారు. చంద్రబాబు విజయానికి ప్రతి ముస్లిం సహకరించాలని కోరారు. విద్యావంతులైన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పెమ్మసాని చంద్రశేఖర్, గల్లా మాధవి, నసీర్ అహ్మద్‌లను అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో మైనార్టీ నాయకులు షేక్ షాకీర్, షేక్ యాసిన్, షేక్ బాషా, షేక్ రబ్బాని, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న షేక్ ఖాజావలీ తదితరులు

నిర్మాణరంగ కార్మికుల జీవితాలతో ఆడుకున్న వైసీపీ

● పశ్చిమ టీడీపీ అభ్యర్థి గల్లా మాధవి, జంగా కృష్ణమూర్తి

గుంటూరు, మే 6(ఆంధ్రజ్యోతి): ఇసుక మాఫియాతో వైసీపీ భవన, నిర్మాణ రంగ కార్మికుల జీవితాలతో ఆడుకుంటుందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గల్లా మాధవి, మాజీ ఎమ్మెల్యే జంగా కృష్ణమూర్తి విమర్శించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో కార్మికులతో ఆత్మీయ సమావేశం జరిగినది. ఈ సందర్భంగా గల్లా మాధవి మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత భవన నిర్మాణ రంగ కార్మికుల జీవితాలకు భరోసా కరువైందన్నారు. తెలుగుదేశం హయాంలో రూ.1500 లోపు మాత్రమే లభించిన ట్రాక్టర్ ఇసుక ఇప్పుడు రూ.6వేలకు పెరిగిందన్నారు. గడిచిన ఐదేళ్లగా భవన నిర్మాణ కార్మికుల భవిష్యత్ అంధకారంలోకి వెళ్ళిందని, ఇప్పటికైనా కార్మికులు వాస్తవ పరిస్థితులను గుర్తించాలని మాధవి కోరారు. వైసీపీ మరోసారి అధికారంలోకి వస్తే రాష్ట్రం విడిచి పొరుగు రాష్ట్రాలకు వలసలు వెళ్ళాల్సిందేనన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే కార్మికులకు భరోసా లభిస్తుందని తెలిపారు. ఇసుకను ఉచితంగా అందజేస్తామని తెలిపారు. జంగా కృష్ణ మూర్తి మాట్లాడుతూ కార్మిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, వివాహ ప్రోత్సాహక సహాయం అందిస్తామన్నారు. సార్వత్రిక ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. అలాగే ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో గుంటుపల్లి శేషగిరిరావు, సింహాద్రి కనకాచారి, కొల్లి అనీల్ తదితరులు పాల్గొన్నారు.



టీఎన్‌టీయూసీ సమావేశంలో మాట్లాడుతున్న గల్లా మాధవి

గుంటూరు 32వ డివిజన్ కోబాల్ట్‌పేట, 34వ డివిజన్ బ్రాడీపేటలో గల్లా మాధవి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోబాల్ట్‌పేటలో పర్యటించిన గల్లా మాధవికి స్థానిక ప్రజలు తమ సమస్యలను ఏకరవు పెట్టారు. విద్యుత్ బిల్లులను సాకుగా చూపి, పథకాలను ఆపేశారన్నారు. గల్లా మాధవి స్పందిస్తూ షరతులు లేకుండా ప్రతి పేదవారికి సంక్షేమ పథకాలు అందిస్తామని హామీనిచ్చారు. బ్రాడీపేటలో వ్యాపారవర్గాలతో మాట్లాడుతూ రాజధాని లేని రాష్ట్రంగా ఏపీని తయారు చేశారని, అమరావతిని సర్వనాశనం చేసారని అందువలన వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారని ఆమె ఆవేదన వ్యక్తం చేసారు. వ్యాపారులు అందరూ కలిసి కట్టుగా టీడీపీని గెలిపించాలని మాధవి కోరారు. కార్యక్రమంలో కిరణ్, అస్మా, చిన్న బాజీ, మన్నయ్య, జుపిటర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● ట్రిపుల్ ఎక్స్ అధినేత మాణిక్యవేల్‌ను గల్లా మాధవి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గుంటూరులోని ఆయన నివాసానికి వెళ్లి అయనను కలుసుకున్న ఆమె ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.



మాణిక్యవేల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాధవి



ఎన్నికల ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న గల్లా మాధవి

వ్యాపార వర్గాలకు అండగా ఉంటా : గల్లా మాధవి

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని వర్తక, వ్యాపారవర్గాలకు అండగా ఉంటానని గల్లా మాధవి హామీ ఇచ్చారు. సోమవారం

చంద్రబాబుతోనే ఎస్సీ, ఎస్టీ, బీసీల అభ్యున్నతి

● తూర్పు నియోజకవర్గ అభ్యర్థి మొహమ్మద్ నసీర్



పార్టీలో చేరినవారితో నసీర్ తదితరులు

గుంటూరు, మే 6(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీల అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని మొహమ్మద్ నసీర్ అన్నారు. 55వ డివిజన్ బొంగరాలబీడులో వైసీపీకి చెందిన మోహన్‌రావు, రాజేష్, మహేష్, వాసు, వందనం, వర్మ, అరవింద్, విజ్ఞాన్, రాజు, రవి, శివ సహా పలువురు నాయకులు, కార్యకర్తలు 200 కుటుంబాలు సోమవారం ఆయన ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరాయి. రాష్ట్ర భవిష్యత్తు చంద్రబాబుతోనే సాధ్యమని వైసీపీని వీడి టీడీపీలో చేరినట్లు తెలిపారు. పార్టీలో వచ్చిన వారికి నజీర్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ వైసీపీ అసమర్థ పాలలో ఎస్టీ, ఎస్సీలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, గత చంద్రబాబు ప్రభుత్వంలో ఎస్సీల కోసం అంబేడ్కర్ విదేశీ విద్య, 100 యూనిట్ల దాక ఉచిత విద్యుత్తు, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా యువతకు ఉపాధి కనిపించేందుకు సబ్సిడీలో ఇనోవా కార్లు ఇవ్వడం వంటి ఎన్నో పథకాలు అందజేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం వాటన్నింటిని పక్కకు పెట్టేసిందన్నారు. టీడీపీ వచ్చిన వెంటనే వాటిని అమలులోకి తెస్తామన్నారు. ఎమ్మెల్యే ముస్తఫా గుట్కా, గంజాయి డబ్బుతో తన కూతురిని గెలిపిద్దామని విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాడు, కానీ ప్రజలు ఆయనను నమ్మే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో హజ్ కమిటీ మాజీ డైరెక్టర్ హసీన్ భాష, గోళ్ళ ప్రభాకర్ పాల్గొన్నారు.

ముస్లింలకు టీడీపీలోనే గౌరవం

ముస్లింలకు టీడీపీలోనే గౌరవం దక్కుతుందని నసీర్ చెప్పారు. 17వ డివిజన్ హుస్సేన్‌నగర్‌లో ఎన్నికల సోమవారం ఆయన పర్యటన నిర్వహించారు. నసీర్ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన మైనారిటీలను ఆదుకోవడం కోసం మొట్టమొదటిసారి బడ్జెట్ కేటాయించి మైనార్టీ కార్పొరేషన్ ద్వారా వారికి తోడుగా నిలిచింది తెలుగుదేశం పార్టీ అన్నారు. విదేశీ విద్యను ప్రవేశపెట్టి మైనార్టీ పిల్లలు కూడా విదేశాల్లో చదువుకుని స్థిరపడేల చేసింది కూడా టీడీపీనేనని ఆయన గుర్తుచేశారు. మైనార్టీల కోసం హజ్ హౌస్ కట్టించింది, మసీదు మరమ్మతులకు, ఖబర్ స్థాన్ ఏర్పాటు, షాది ఖానాల నిర్మాణానికి బడ్జెట్ కేటాయించి ముస్లింల అభివృద్ధికి తోడ్పడింది, దుల్హన్, రంజాన్ తోఫా ఇచ్చింది చంద్రబాబేనని అన్నారు. కార్యక్రమంలో మల్లెంపూడి శ్రీనివాస్, సురే శీను, రాధంశెట్టి జగన్, వజ్జలక్ష్మి, వలి, మస్తాన్, అలీ, సూరం లక్ష్మి, ఎండి రఫీ తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయంతోనే అభివృద్ధి సాధ్యం : నసీర్

గుంటూరు, మే 6(ఆంధ్రజ్యోతి): కూటమి విజయంతోనే అభివృద్ధి సాధ్యమని గుంటూరు తూర్పు నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి మొహమ్మద్ నసీర్ అన్నారు. ఆయన ప్రజాదీవెన పాదయాత్ర 15వ రోజు సోమవారం డొంకరోడ్డు మాలకొండయ్య కాలనీ నుంచి ప్రారంభమై శ్రీనగర్, మల్లికార్జునపేట, మహబూబ్ నగర్ వరకూ కొనసాగింది. నసీర్ ప్రతి గడపకు వెళ్లి ఓటు అభ్యర్థిస్తూ, కరపత్రాలు పంచుతూ ప్రజా సమస్యలు తెలుసుకుంటూ రానున్న రోజుల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే వాటిని పరిష్కరిస్తానని హామీ ఇస్తూ ముందుకు సాగారు. నసీర్ మాట్లాడుతూ రాజధాని కాపాడుకుంటేనే ముందు తరాలకు భవిష్యత్తు ఉంటుందని నసీర్ అన్నారు. గత ఐదేళ్లలో గుంటూరు ప్రధాన రహదారులు, రోడ్లు గుంతలు పడి గుంతలూరుగా మారుతున్నా ఎమ్మెల్యే ముస్తఫా పట్టించుకోకుండా తన కుటుంబ సభ్యులు గుట్కా, గంజాయి, డ్రగ్స్ వ్యాపారాలతో యువత భవిష్యత్తు నాశనం చేస్తూ ఆస్తులను కూడబెట్టుకునే పనిలో ఉన్నాడన్నారు. ఆటోనగర్‌లో కొంతమంది టీడీపీలో చేరినందుకు వారిపై కుట్ర చేసి వారి షాపులను తగలబెట్టి, తీరని నష్టం చేసి వారి జీవితాల మీద దెబ్బకొట్టిన ఎమ్మెల్యే ముస్తఫాతో టీడీపీ అధికారంలోకి వచ్చాక వారి కన్నీళ్లకు సమాధానం చెప్పిస్తామన్నారు. కార్యక్రమంలో ముప్పవరపు భారతి, గోళ్ళ ప్రభాకర్, హుసైన్ బాషా, నవీన్, మహంకాళి నరసింహారావు, జనసేన డివిజన్ అధ్యక్షుడు గాజుల రమేష్, జనసేన మహిళ నాయకురాలు మల్లేశ్వరి, యద్దల నాగలక్ష్మి, గుంతల సాయిబాబా, దాసరి రమేష్, నాయుడు మధు, జబ్బు సైదులు, ఎండీ రఫీ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాదీవెన యాత్రలో ప్రజలను కలుస్తున్న నసీర్

శంకర కంటి ఆస్పత్రి పీఆర్వో సురేష్ హఠాన్మరణం

● నివాళులర్పించిన డాక్టర్ శివాజీ, కరుణ చంద్రబాబు, జడ్జిలు



సురేష్ (ఫైల్)

పెదకాకాని, మే 6 : పెదకాకాని శంకర కంటి ఆస్పత్రి పీఆర్వోగా పని చేస్తున్న లంకా సురేష్ (62) హఠాన్మరణం చెందారు. అకస్మాత్తుగా ఆయన అనారోగ్యానికి గురై విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం కన్నుమూశారు. పెదకాకాని శంకర కంటి ఆస్పత్రిలో పీఆర్వోగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన ఎవరైనా చనిపోతే వారి కుటుంబ సభ్యుల అనుమతి మేరకు వారి కళ్లను డొనేట్ చేయించి ఎందరికో చూపునిచ్చారు. శంకర కంటి ఆస్పతికి ఆయన విస్తృతంగా సేవలందించారు. ఆయన తండ్రి లంకా సూర్యానారాయణ గుంటూరు బృందావన్‌గార్డెన్స్‌లోని అన్నమయ్య గ్రంథాలయ వ్యవస్థాపకులుగా పని చేస్తున్నారు. రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచలి శివాజీ, మున్సిపల్ మాజీ కమిషనర్ దేవినేని కరుణ చంద్రబాబు, విశ్రాంత జడ్జి జీకే శంకర్ తదితరులు సురేష్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన అంత్యక్రియలు గుజ్జనగుండ్లలోని మహాప్రస్థానంలో ముగిశాయి.

రైలులో గుర్తు తెలియని యువకుడి మృతదేహం

గుంటూరు, మే 6 : గుంటూరు రైల్వే స్టేషన్ రైల్ నెంబర్ 17626 వికారాబాద్ ఎక్స్‌ప్రెస్ (రేపల్లె-వికారాబాద్) జనరల్ బోగిలో సుమారు 40 సంవత్సరాల వయసు కలిగిన గుర్తు తెలియని పురుషుడి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. తదుపరి దర్యాప్తు నిమిత్తం కేసు నమోదు చేసి మృతదేహాన్ని జీజీహెచ్‌లోని మార్చురీలో భద్రపరిచారు. మృతుడు చామన చాయ రంగు, పూర్తి గడ్డం కలిగి ఉన్నాడు. బ్లూ రంగుపుల్ హ్యాండ్ షర్టు, కాఫీరంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. గుర్తించిన వారు గుంటూరు జీఆర్పీ పోలీస్ వారికి లేదా సీఐ గంగా వెంకటేశ్వర్లు 9440627546, ఎస్సై వెంకటాద్రికి 7386843339లో తెలియజేయాలని కోరారు.

బ్రాడీపేటలో...

బ్రాడీపేట 5/18లోని ఖాళీ ప్రదేశంలో 40 సంవత్సరాల గుర్తు తెలియని ఒక వ్యక్తి చనిపోయి ఉండగా సదరు మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుని కుడి చేతిపై ఎస్.సాగర్, ఎస్.బుజ్జి అను పచ్చబొట్లు ఉన్నాయి. ఆచూకీ తెలిసిన వారు పట్టాభిపురం పోలీస్ స్టేషన్ సీఐ 8688831343లో సంప్రదించాలని కోరారు.

టీడీపీ అభ్యర్థులు పెమ్మసాని, మాధవి, రాజేష్‌లపై కేసు

● తనను కించపరిచేలా కరపత్రాలు పంచుతున్నారంటూ మంత్రి రజిని ఫిర్యాదు

● ప్రాథమిక విచారణ లేకుండానే కేసు నమోదు చేశారని టీడీపీ ఆరోపణ

గుంటూరు, మే 6 : గుంటూరు పార్లమెంటు, పశ్చిమ నియోజకవర్గాల నుంచి టీడీపీ తరపున పోటీ చేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్, గల్లా మాధవితో పాటు టీడీపీ నాయకుడు మల్లెల రాజేష్ నాయుడు తదితరులపై కేసు నమోదైంది. తనను కించపరిచేలా కరపత్రాలు ముద్రించి పంపిణీ చేస్తున్నారంటూ మంత్రి, పశ్చిమ నియోజకవర్గం వైసీపీ అభ్యర్థిని విడదల రజని పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అక్రమాల మంత్రి పట్ల తస్మాత్ జాగ్రత్త... గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ప్రజలకు చిలకలూరిపేట జనుల ముందస్తు ప్రమాద హెచ్చరిక పేరుతో కరపత్రాన్ని ముద్రించి పంపిణీ చేస్తున్నారన్నారు. అయితే కరపత్రంపై ప్రచురణకర్త పేరు కూడా రాయలేదన్నారు. అసత్యాలతో కూడిన దుర్మార్గపు వ్యాఖ్యలు చేయడం ద్వారా తన పరువు, ప్రతిష్ఠలు, గౌరవ మర్యాదలకు భంగం కలిగించారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పట్టాభిపురం పోలీసులు ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు.

మంత్రి రజని చేసిన ఫిర్యాదుపై కనీసం ప్రాథమిక విచారణ జరపకుండా, ఆధారాలు సేకరించకుండానే ఇరువురు టీడీపీ అభ్యర్థులతో పాటు మరో నాయకుడిపై కేసు నమోదు చేయడంపై టీడీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఆ కరపత్రాన్ని ఎవరు ముద్రించారు అనే విషయం తెలుసుకోకుండానే కేసు నమోదు చేయడాన్ని వారు తప్పుపడుతున్నారు. పోలీసులు కూడా అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ అధికార పార్టీ నేతలు ఫిర్యాదు చేసిన వెంటనే కేసులు నమోదు చేస్తున్నారని, అయితే టీడీపీ అభ్యర్థులు, పార్టీ నాయకులు ఇస్తున్న ఫిర్యాదులను మాత్రం బుట్ట దాఖలు చేస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

అనంతపురం డీఎస్పీగా ప్రతాప్‌కుమార్ నియామకం

గుంటూరు, మే 6 : జిల్లా ఏసీబీ డీఎస్పీ టీవీవీ ప్రతాప్‌కుమార్‌ను అనంతపురం డీఎస్పీగా నియమించారు. వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే కారణంతో అనంతపురం, రాయచోటి డీఎస్పీలు వీర రాఘవరెడ్డి, మహబూబ్‌బాషాలను అత్యవసరంగా విధుల నుంచి తప్పిస్తూ ఎన్నికల కమిషన్ ఆదేశించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో అనంతపురం అర్బన్ డీఎస్పీగా ఏసీబీ డీఎస్పీ ప్రతాప్‌కుమార్‌ను నియమించడంతో ఆయన సోమవారమే ఇక్కడ విధుల నుంచి రిలీవ్ అయ్యారు. ఆ వెంటనే అక్కడ విధుల్లో చేరేందుకు వెళ్ళారు.

క్రైస్తవులపై జరిగే దాడులను అడ్డుకుంటాం

● పెమ్మసాని శ్రీరత్న, నసీర్

గుంటూరు, మే 6(ఆంధ్రజ్యోతి): క్రైస్తవులపై జరిగే దాడులను అడ్డుకుంటామని గుంటూరు పార్లమెంటు కూటమి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ భార్య శ్రీరత్న, తూర్పు అభ్యర్థి మొహమ్మద్ నసీర్ హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని ఏఎస్ కల్యాణ మండపంలో జరిగిన పాస్టర్ల ఆత్మీయ సమ్మేళనానికి వారు హాజరయ్యారు. ప్రార్థనల్లో పాల్గొన్నారు. క్రిస్టియన్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ మద్దిరాల మ్యాని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరునెలల్లోనే 10 శాతం మిగిలివున్న క్రిస్టియన్ భవన్ నిర్మాణాలను పూర్తి చేసి, సమాధుల తోట కోసం చంద్రబాబు ఇచ్చిన 16.53 ఎకరాల స్థలంలో కాంపౌండ్ వాల్ నిర్మిస్తామన్నారు. పాస్టర్స్ ఫెలోషిప్ జోన్ 3 ఛైర్మన్ డాక్టర్ ఎంఎస్ విక్రాంత్ వాక్య సందేశాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో నీలం కుమార్, కారంగి అనిల్, ఏసు ప్రసాద్, పాల్, ప్రశాంత్ రాజ్, ఆనందపాల్, విక్టర్ ప్రకాశ్, తిమోతి, డేవిడ్, రమేశ్ పాల్గొన్నారు.



పాస్టర్ల సమావేశంలో ప్రార్థనలు చేస్తున్న శ్రీరత్న, నసీర్, మ్యాని

టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శిగా కసుకుర్తి

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన కసుకుర్తి హనుమంతరావు నియమితులయ్యారు. ఆ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటన విడుదల చేశారు.

కాపు రిజర్వేషన్లు రద్దు చేసిన జగన్ ఉద్ధారకుడా?

● జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ఆరేటి ప్రకాశ్

గుంటూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): కాపులకు చంద్రబాబు ఇచ్చిన 5 శాతం రిజర్వేషన్లు రద్దు చేసిన జగన్ రెడ్డి కాపు ఉద్ధారకుడా అని కాపు జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ఆరేటి ప్రకాష్ ప్రశ్నించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రిజర్వేషన్లు రద్దు చేసి విద్య, ఉద్యోగావకాశాలను కాపులకు దూరం చేసిన జగన్ రెడ్డిని మించిన కాపు వంచకుడు ఎవరూ లేరని అన్నారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక కాపులను ఉద్ధరించానని చెప్పుకోవడం తప్ప కాపుల కోసం ప్రత్యేకంగా చేసింది ఏమిలేదని అన్నారు. కాపులకు ఏటా రూ.2 వేల కోట్ల బడ్జెట్ కేటాయించి ఖర్చు చేశామన్న జగన్ రెడ్డి కాపు కార్పొరేషన్ ద్వారా ఎంత ఖర్చు చేశారో చెప్పే ధైర్యం ఉందా అని నిలదీశారు. కార్పొరేషన్ రుణాలు రద్దు చేసి, కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమాన్ని, అభివృద్ధిని సమన్వయంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయగల చంద్రబాబు నాయకత్వం రాష్ట్రానికి చాలా అవసరమని చెప్పారు. జేఏసీ నేత వాసిరెడ్డి యేసుదాస్ మాట్లాడుతూ జగన్‌రెడ్డి అధికారంలోకి రాగానే కాపు కార్పొరేషన్ రుణాల కోసం చేసుకున్న 47 వేలకు పైగా దరఖాస్తులను రద్దు చేశారని ఆరోపించారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కాపు భవనాల నిర్మాణానికి రూ.165 కోట్లు కేటాయిస్తే, జగన్‌రెడ్డి ఆ నిర్మాణాలను కూడా పూర్తి చేయకుండా పాడుబెట్టాడన్నారు. కాపులకు అండగా నిలిచిన చంద్రబాబును అధికారంలోకి తీసుకురావడం కాపుల బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాపు నాయకులు ఆళ్ళ హరి, సవరం రోహిత్, కొలసాని బాలకృష్ణ, చెమిటిగంటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కాపు నేతలు

వివాహిత ఆత్మహత్య కేసులో నిందితులను అరెస్టు చేయాలి

● కేసు ఉపసంహరించుకోమని బెదిరిస్తున్నారు

● ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన మృతురాలి తండ్రి

గుంటూరు, మే 6 : భర్త, అత్తింటి వేధింపులు తట్టుకోలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న కేసులో నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రక్షణ కల్పించాలని మృతురాలి తండ్రి సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. బాధితుడు నడింపల్లి మార్కండేయులు ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తనది పెదకాకాని మండలం గోళ్ళమూడి గ్రామం అని, తన రెండో కుమార్తె అనూషను ఆరేళ్ల క్రితం వేమూరు మండలం కుచ్చళ్ళపాడు గ్రామానికి చెందిన గాజుల ప్రవీణ్ కుమార్‌కి ఇచ్చి వివాహం జరిపించామన్నారు. వివాహం సందర్భంగా ఎకరం పొలం, పదిసవర్లు బంగారం, రెండు లక్షల నగదు, రూ.20 వేల ఆడపడుచు కట్నం ముట్ట చెప్పామని తండ్రి మార్కండేయులు పేర్కొన్నారు. వివాహమైనప్పటి నుంచి తన కూతురు, అల్లుడు గోరంట్లలోని తన బాబాయి, పిన్ని అయిన జల్లేపల్లి శ్రీనివాసరావు, వరలక్ష్మి ఇంటిలోనే ఉంటూ వారి కంపెనీలోనే పని చేస్తూ ఉండేవాడు అన్నారు. వారికి గాజుల ధీరజ్ (3), గోకుల్ (18 నెలలు) సంతానం ఉన్నారన్నారు. అయితే తన అల్లుడు రెండేళ్ల నుంచి ఏ పని చేయకుండా ఇంటి వద్ద ఉంటూ సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతూ తన కూతురికిచ్చిన బంగారు ఆభరణాలను, అదేవిధంగా ఎకరం పొలాన్ని తాకట్టుపెట్టి ఆన్‌లైన్ బెట్టింగులో మొత్తం పోగొట్టాడన్నారు. అంతేగాక పెద్ద ఎత్తున అప్పులు కూడా చేశాడన్నారు. ఈ విషయమై తాము తమ అల్లుడిని, అతని తల్లిదండ్రులను ప్రశ్నించగా ప్రవీణ్ కుమార్ చేసిన అప్పులను తీర్చి ఇక నుంచి సక్రమంగా ఉండే విధంగా చూసుకుంటామని ఆయన తల్లిదండ్రులు చెప్పారన్నారు. అయినప్పటికీ ఆరు నెలలుగా ప్రవీణ్ కుమార్, ఆయన తల్లిదండ్రులు, ఆయన బాబాయి, పిన్నిలు తమ కుమార్తెకు ఇచ్చిన ఎకరం పొలం అమ్మి డబ్బులు తీసుకురావాలని శారీరకంగా, మానసంగా వేధించారన్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది ఫిబ్రవరి 22న తమ కుమార్తె ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. తమ కుమార్తె మృతిపై తాము నల్లపాడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా భర్త, అత్త,మామలు, అల్లుడు బాబాయి, పిన్ని తదితరులపై నల్లపాడు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారన్నారు. ఆ కేసులో అల్లుడు ప్రవీణ్ కుమార్‌ను మాత్రమే అరెస్టు చేశారన్నారు. అయితే ప్రవీణ్ కుమార్ ఇరువురి పిల్లలకు న్యాయం చేస్తామని, ప్రవీణ్ కుమార్‌ను బెయిలుపై బయటకు తీసుకురావాలని ఆయన మేనమామ తిరుమలశెట్టి చిన్నపాలోచన కోరగా అయన ప్రకారం తాము కోర్టులో జడ్జి ఎదుట రాజీపడుతున్నామని చెప్పడంతో అల్లుడికి బెయిల్ ముంజూరు చేశారన్నారు. బెయిల్‌పై విడుదలైన తర్వాత ఆయన చిన్న పిల్లల పేరుతో రాస్తానన్న ఆస్తిని రాయకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. అంతేగాక ఆ కేసులో రాజీ పడాలని, లేకపోతే చంపేస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు. ఆయనపై తగు చర్యలు తీసుకోవడంతో పాటు తమ కుమార్తె మృతి కేసులో నిందితులైన వారిని కూడా అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచాలని ఆయన పోలీసు ఉన్నతాధికారులను వేడుకున్నారు.

మానవాళికి ధర్మాన్ని నిర్దేశించే శ్రీ రామాయణం



ప్రవచనం చేస్తున్న కేవీ కోటేశ్వరరావు

గుంటూరు(తూర్పు), మే 6 : స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు, సుందర సత్సంగ్ సభ్యులు కేవీ కోటేశ్వరరావుచే మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న సంక్షిప్త రామాయణం ప్రవచనం సోమవారం ప్రారంభమైంది. మొదటి రోజు ప్రవచనాన్ని ప్రారంభిస్తూ శ్రీ రాముడు పుట్టుకతోనే పూర్ణ పురుషుడుగా పుట్టలేదని, మహోన్నత విలువలతో పూర్ణ పురుషుడైనాడన్నారు. సకల సద్గుణాలతో ప్రజా పరిపాలన చేశాడు. కష్ట సమయాలలో కూడా సత్య ధర్మాలను విడవకుండా జీవితాన్ని కొనసాగించి లోకానికి ధర్మ పురుషుడయ్యాడు. మన జీవితం పరిపూర్ణం కావాలంటే అత్యుత్తమమైన శ్రీ రామాయణ గ్రంథం పఠనం ఒక్కటే శరణ్యం అన్నారు. తొలుత కార్యక్రమాలను ఆలయ పాలక మండలి సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, సుందర సత్సంగ వారు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. కార్యక్రమంలో మన్నవ రవిప్రసాదు, పి.శివారెడ్డి, సాంబశివరావు, మురికిపూడి లక్ష్మి సత్యనారాయణ పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో మనోహర్‌కు ఆత్మీయ పలకరింపులు, ఘన స్వాగతాలు

పశ్చిమలో.. ముందడుగు


- రాజకీయాలకు కొత్త అయినా.. పశ్చిమలో గల్లా మాధవి దూకుడు
- అన్ని వర్గాలతో మమేకం
- ప్రతీ సమస్యను శ్రద్ధగా ఆలకిస్తూ వాటి పరిష్కారానికి నిర్దిష్ట హామీలు
- నేతలు, క్యాడర్ అంత ఒక తాటి పైకి వచ్చి మాధవి గెలుపునకు కృషి



గుంటూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): ఆమె రాజకీయాలకు కొత్త. అయితేనేమి ఎన్నికల్లో గెలుపునకు అది సమస్యే కాదని తన ప్రచారాల ద్వారా స్పష్టం చేస్తున్నారు తెలుగుదేశం పార్టీ గుంటూరు పశ్చిమ అభ్యర్థి గల్లా మాధవి. మాధవి భర్త రామచంద్రరావు పారిశ్రామికవేత్తగా, స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహించిన వ్యక్తిగా సుపరిచితమే. అయితే ఈ ఎన్నికల్లో అదృష్టం వారి తలుపు తట్టింది. గుంటూరు పశ్చిమ టీడీపీ టిక్కెట్ కోసం ఎంతోమంది రెండు, మూడేళ్లుగా ప్రయత్నిస్తున్నప్పటికీ వారందరిని కాదని తెలుగుదేశం పార్టీ అధిష్టానం గల్లా మాధవిని ఎంపిక చేసింది. అప్పటికే వైసీపీ మంత్రి విడదల రజనిని ఇక్కడ అభ్యర్థిగా ప్రకటించింది. రజనికి ధనబలం అధికంగా ఉన్నప్పటికీ ప్రజల మద్దతుతోనే ప్రస్తుత ఎన్నికల్లో గెలిచేందుకు గల్లా మాధవి అహర్నిశలు శ్రమిస్తున్నారు.

తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ని కూడా కాదని గల్లా మాధవిని చంద్రబాబు గుంటూరు పశ్చిమ అభ్యర్థిగా ఎంపిక చేశారు. ఆమెని భారీ మెజార్టీతో గెలిపించాల్సిందిగా నాయకులందరికి దిశ నిర్దేశం చేశారు. జిల్లా రాజకీయాల్లో తలపండిన నేతగా పేరున్న మాజీమంత్రి డాక్టర్ మాకినేని పెదరత్తయ్య ఆమెకు అండగా ఉంటూ రాజకీయ వ్యూహాలను రచిస్తున్నారు. నామినేషన్ల ఘట్టం ప్రారంభం కావడానికి కొద్దిరోజుల ముందే టిక్కెట్ లభించినా పశ్చిమ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను ఇప్పటికే ఒక దఫా మాధవి చుట్టేశారు. గడప గడపకు వెళ్లి ఓటర్లని కలుసుకొని తనను ఆశీర్వదించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదే సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను శ్రద్ధగా ఆలకిస్తున్నారు. వాటి పరిష్కారానికి కూడా నిర్దిష్ట హామీలు ఇస్తూ ముందుకు సాగుతున్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఆర్‌యూబీలు, ఆర్‌వోబీలు, ఇన్నర్ రింగు రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్లు, రైతుబజార్లు వంటివాటికి నిధులు తీసుకొచ్చి కొద్ది రోజుల్లోనే పరిష్కరిస్తామని హామీ ఇస్తూ ప్రజల మద్దతు కూడగట్టుకొంటున్నారు.

టిడ్కో ఇళ్లను తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం నిర్మిస్తే వాటిని వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు మూలన పెట్టి చివరికి రంగులు మార్చి, అరొకర వసతులతో లబ్ధిదారులకు అందజేసింది. తాము అధికారంలోకి వస్తే వాటిని ఉచితంగానే రిజిస్ట్రేషన్ చేస్తామని చంద్రబాబు ఇచ్చిన హామీని ఆమె లబ్ధిదారులకు వివరిస్తూ వారి ఆశీస్సులు తీసుకొంటున్నారు. ఇన్నర్ రింగు రోడ్డు ఫేజ్-3 పూర్తి చేసేందుకు హామీ ఇచ్చారు. కాగా వైసీపీ పాలనలో దగాపడ్డ వివిధ వర్గాలతో ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేసి వారికి జరిగిన నష్టాన్ని నేరుగా తెలుసుకొంటున్నారు. దానిని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి తప్పక సాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కారణంగానే విశ్వబ్రాహ్మణ, వడ్డెర, యాదవ, కాపులు, ముస్లింలు, ఎస్సీలతో ఆమె ఏర్పాటు చేసిన సమావేశాలకు విపరీతమైన స్పందన లభించింది. గతవారంలో ఇన్నర్‌రింగు రోడ్డు వద్ద నుంచి చంద్రబాబు గుంటూరు పశ్చిమలో నిర్వహించిన రోడ్డుషోకు భారీగా జనం తరలిరావడం మాధవికి కొండంత బలాన్ని ఇచ్చినట్లు అయింది. కేవలం ఐదు కిలోమీటర్ల దూరం రోడ్డుషోకు 3 గంటల సమయం పట్టిందంటే తెలుగుదేశం పార్టీ క్యాడర్ ఏ విధంగా ఈ ఎన్నికల్లో మాధవి గెలుపుకోసం కదం తొక్కుతుందో స్పష్టంగా కనిపించింది. వైసీపీ గాలిలోనూ గుంటూరు పశ్చిమలో టీడీపీ జెండా రెపరెపలాడింది. అలాంటిది ఇప్పుడు వైసీపీ ప్రభుత్వ వ్యతిరేకత ఉచ్ఛస్థితికి చేరుకొన్న తరుణంలో గల్లా మాధవి గెలుపు కంటే ఎంత మెజార్టీ వస్తుందన్న దాని పైనే టీడీపీ శ్రేణులు దృష్టి సారించాయి. కాగా వైసీపీకి ఏమాత్రం పట్టులేని నియోజకవర్గానికి మంత్రి విడదల రజినీ వలస వచ్చి గెలుపు కోసం అష్టకష్టాలు పడుతున్నారు.



కూటమి హోరు..

- ప్రత్యర్థులు బేజారు
- తెనాలిలో ఊపందుకున్న ఎన్నికల వేడి
- చేరికలు, ప్రచారంలో ముందున్న కూటమి
- పవన్, బాబు పర్యటనలతో మరింత ఊపు

తెనాలి, మే6 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ తేదీ దగ్గర పడుతున్న కొద్దీ కూటమి హోరు కూడా అంతే వేగంగా పెరిగిపోతూ వస్తోంది. అధికార పార్టీ నుంచి చేరికలు రోజురోజుకూ పెరుగుతుంటే, సాధారణ కార్యకర్తలే కాకుండా ముఖ్య నేతలు కూడా జనసేన, టీడీపీ కండువాలు కప్పుకోవటం మరింత బలాన్ని తెచ్చిపెడుతోంది. ఒక పక్క అసెంబ్లీ అభ్యర్థిగా మనోహర్ రంగంలో ఉంటే, కూటమి నుంచి గుంటూరు ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తోడవటంకూడా బలం, సమీకరణాలు కలసివచ్చినట్టవుతుందనేది కూటమి శ్రేణుల ఆలోచన. మరోపక్క ప్రచారంలోనూ ఇరువురికీ జనం బ్రహ్మరథం పడుతుండటం కూటమిలో నూతన ఉత్సాహాన్ని నింపుతోంది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తెనాలిలో టీడీపీ, జనసేన, బీజేపీ బలపరిచిన కూటమి అభ్యర్థిగా జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పోటీలో ఉన్న విషయం తెలిసిందే. అటు ప్రధాన అధికార పార్టీ తరపున సిటింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తిరిగి పోటీలో నిలిచారు. ఇంకా పోలింగ్‌కు కేవలం ఆరు రోజులే గడువు ఉండటంతో నియోజకవర్గంలో వేడికూడా అంతే పెరిగిపోయింది. అయితే ప్రచారంలో మాత్రం జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి దూసుకుపోతోంది. ప్రచారంలో అడుగడుగునా బ్రహ్మరథం పట్టటం, జనం నుంచి ఆప్యాయ పలకరింపులు, ఆయన చేసిన అభివృద్ధి పనులను వారే గుర్తు చేస్తుండటం విశేషం. దీనికితోడు ఆయన పదేళ్ల క్రితం చేసి చూపించిన అభివృద్ధి ప్రచారంలోనూ మరింత మేలు చేకూర్చుతున్నట్టే. దీనికితోడు తాజాగా తెలుగుదేశం అధినేత చంద్రబాబు, తన సొంత పార్టీ జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌లు ఇద్దరూ తెనాలి రావటం, వారు వచ్చిన సమయంలో భారీ జన సందోహంతో తన బలాన్ని చూపించటంకూడా జనంలో మరింత నమ్మకాన్ని పెంచినట్టయింది. వారి రాకతో మరింత బలంకూడా తోడైంది.

చంద్రబాబు, పవన్ రాకతో..

ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇటీవల జనసేన అధినేత పవన్ కళ్యాణ్, తాజాగా టీడీపీ అధినేత చంద్రబాబు తెనాలి వచ్చారు. అప్పటి వరకు కూటమి అభ్యర్థికి పెద్దగా బలం లేదని, అనేక ప్రతికూల పరిస్థితులు నియోజకవర్గంలో ఉండటంతో ఆపార్టీకి బలమైన రెండు సామాజిక వర్గాలు దూరంగా ఉంటున్నాయనే ప్రచారాన్ని తెరపైకి తీసుకొచ్చారు. అయితే ఈ ప్రచారాలన్నిటికీ తెరదించుటూ జనం పోటెత్తి తమ సత్తా చూపించారు. పవన్ కళ్యాణ్ పర్యటన సమయంలో, చంద్రబాబు పర్యటనకూ టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు భారీగా తరలిరావటం, అటు ర్యాలీలోనూ రెండు కి.మీటర్ల రోడ్డు పొడవున ర్యాలీగా రావటానికి రెండున్నర గంటల సమయం పట్టిందంటే కూటమికి జన ఆదరణ ఏమేర ఉందనేది అర్థమవుతుంది. గత ఎన్నికల్లో అనేక కారణాలతో కమ్మ, కాపు సామాజిక వర్గాల నుంచి కూడా వైసీపీకి ఓట్లు బాగానే పడ్డాయి.

కుటుంబం మొత్తం ప్రచారంలోనే...

మనోహర్‌తో పాటు ఆయన భార్య డాక్టర్ మనోహరం, కుమారుడు మితుల్ ఇరువురూ ప్రచారంలో దూసుకుపోతూనే ఉన్నారు. మనోహరంపై అసత్య ప్రచారాలకు వైసీపీ పూనుకుంటే, జనం మాత్రం వాటిని తిప్పికొడుతూ ఆమెవెంట పర్యటనల్లో ముందుకు రావటం వారి ప్రచారాలకు సమాధానం చెప్పినట్టయింది. భారీగా మహిళలు ఆమెతో కలసి నడుస్తుంటే, కుమారుడు మితుల్ మాత్రం యువతలో ఉత్సాహాన్ని నింపుతున్నారు. వెళ్లిన చోటల్లా గాజుగ్లాసు గుర్తుండేలా వారితో కలసి గాజుగ్లాసులోనే తేనీటి విందులు, ప్రచారానికి కూడా గ్లాస్ సింబల్ చూపుతుండటంతో వారి ఎన్నికల గుర్తు ప్రచారానికి మరింత ఉపయోగపడుతోంది. వీరు కాక జనసేన మరో మహిళా నేత రాయపాటి అరుణ కూడా ప్రచారంలో ఊపు తీసుకొచ్చారు. మహిళల్లో ఉత్సాహాన్ని నింపుతూ, జనసేన కూటమి చేయబోయే అభివృద్ధితో కూడిన సంక్షేమం, శాంతి భద్రతల పరిరక్షణ వంటివాటిపై జనంలోకి తీసుకువెళ్లటంకూడా మరింత బలాన్ని పెంచింది. అయితే ఆమె కారు ప్రమాదానికి గురవటంతో చివరి రోజుల్లో ప్రచారానికి రాలేని పరిస్థితి ఏర్పడింది. అయితే వీరికంటే మనోహర్ ప్రచారం ఒక పక్క, సామాజిక వర్గాలు, వృత్తిపరమైన సంఘాలతో మమేకమవుతూ, ఆత్మీయ సమావేశాల్లోనూ ముందున్నారు. జనం వారిని ఆదరిస్తున్న తీరు, ఇద్దరు వైసీపీ కౌన్సిలర్‌లు అధికార పార్టీని వీడి జనసేన, టీడీపీ పార్టీల్లో చేరటం వంటివి మా గెలుపుకు శుభసూచికమంటూ ఆశాభావాన్ని కూటమి శ్రేణులు వ్యక్తం చేస్తున్నారు.



గాజుగ్లాజు గుర్తుకు ఓటేయాలని ప్రచారం చేస్తున్న మనోహర్ భార్య డాక్టర్ మనోహరం, ప్రచారంలో మనోహర్ కుమారుడు మితుల్

రాజీలేని పోరాటం

- పొన్నూరును పసుపు కోటగా మార్చిన ధూళిపాళ్ల
- 6వ సారి విజయం కోసం ధూళిపాళ్ల కఠోర శ్రమ
- నియోజకవర్గాన్ని చుట్టివస్తున్న కుటుంబసభ్యులు

పొన్నూరుటౌన్, మే6: స్వర్ణపురిగా పేరుగాంచిన పొన్నూరులో వరుస విజయాలతో టీడీపీ రంగైన పసుపు కోటగా మార్చిన ఘనత ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌కే దక్కుతుంది. మరోసారి పొన్నూరుపై టీడీపీ జెండాను ఎగురవేసేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారు. ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి వారసుడిగా రాజకీయ అరంగేట్రం చేసిన నరేంద్ర కుమార్ 1994 నుంచి 2014 వరకు వరుసుగా ఐదు పర్యాయాలు అప్రతిహత విజయాలతో దూసుకువెళ్లారు. గత ఎన్నికల్లో కేవలం 1124 ఓట్ల తేడాతో ఓటమి చెందారు. నాటి నుంచి పొన్నూరులోనే మకాం వేసి 2024 ఎన్నికలే లక్ష్యంగా ముందుకు సాగారు. వైసీపీ ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులకు గురిచేసిన రాజీలేని పోరాటాన్ని సాగించారు. 2019 నుంచి 2024 ఎన్నికల ముందు వరకు వరుసుగా 16 కేసులు నమోదు చేసి ప్రభుత్వం వేధించినప్పటికి వెనకడుగు వేయలేదు. స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అవినీతి అక్రమాలపై, వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై అలుపెరగని పోరాటం చేశారు. ఈ క్రమంలో ముందస్తు అరెస్టులు, అక్రమ నిర్బంధాలు సాగించినప్పటికి నరేంద్ర కుమార్ పోరాటాని ఆపలేదు. సరికదా మరింత వేగంగా కార్యక్రమాలు చేసి వైసీపీ పాలకులకు కంటిలో నలుసుగా మారారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం సంగం డెయిరీలో అక్రమాలు జరిగాయని నరేంద్ర కుమార్‌పై ఏసీబీతో కేసు నమోదు చేయించటమే కాకుండా 30 రోజుల పాటు జైలు పాలుచేసింది. జైలు నుంచి విడుదలై వెనకడుగు వేయకపోగా రెట్టించిన ఉత్సాహంతో ప్రభుత్వంపై పోరు సాగించారు. అక్రమ కేసుల నమోదు, జైలు సంఘటనలు నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలనే కాకుండా సామాన్య జనాని సైతం కదిలించి నరేంద్ర కుమార్ వెంట నడిచేలా చేశాయి. అప్పటి వరకు నెమ్మదించిన పార్టీ శ్రేణులు నరేంద్ర కుమార్ అరెస్టుతో ప్రభుత్వంపై పోరాటానికి కదిలివచ్చారు. సౌమ్యుడిగా, వివాదరహితుడిగా పేరువున్న నరేంద్ర కుమార్‌ను జైలుకు పంపించటం నియోజకవర్గ ప్రజలు నేటికి జీర్ణించుకోలేకుండా వున్నారు.

విజయం కోసం కఠోర శ్రమ..

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంతో 6వ సారి విజయం సాధించేందుకు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ కఠోరంగా శ్రమిస్తున్నారు. ఎన్నికలకు ఏడాది ముందు నుంచే నియోజకవర్గాన్ని మూడుసార్లు చుట్టివచ్చారు. పార్టీ కార్యక్రమాలతో పాటు సొంత అజెండా రూపొందించుకొని నియోజకవర్గంలోని ప్రతి గడపను తట్టి ప్రజలను పలకరించటమే కాకుండా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో సైతం ప్రభుత్వం కన్న ముందు స్పందించి ప్రజల చెంతకు వెళ్లటమే కాకుండా వారి బాగోగులు చూసుకున్నారు. అలాగే జనసేన కూటమి ఏర్పడిన తర్వాత జనసైనికులతో కలిసి పలు ఆత్మీయ సమావేశాలు నిర్వహించి టీడీపీ, జనసేన శ్రేణులు ఏకతాటిపైకి వచ్చేలా ప్రణాళికలు రూపొందించారు. ప్రారంభంలో భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికి నరేంద్ర కుమార్ ముందు చూపుతో వ్యవహరించటంతో రెండు పార్టీ శ్రేణులు నియోజవకర్గంలో ఏకతాటిపైకి వచ్చి కార్యక్రమాలో పాల్గొనటమే కాకుండా ఉమ్మడి ప్రచారాలు నిర్వహించేలా చేయటంలో నరేంద్ర కుమార్ సఫలీకృతులయ్యారు.

అంతేకాకుండా నరేంద్ర కుమార్ సతీమణి జ్యోతిర్మయి, కుమార్తెలు నాగసాయి వైదీప్తి, డాక్టర్ వీరవైష్ణవిలు కూడా ఎన్నికల ప్రచరాలో పాల్గొంటూ కూటమి అభ్యర్థులను గెలిపించాలని విస్తృత్తంగా చేస్తున్నారు. గత ఎన్నికలో డబుల్ హ్యాట్రిక్ తృటిలో చేజార్చుకున్న నరేంద్ర కుమార్ ఈ ఎన్నికలో 6వ సారి విజయం సాధించేలా పావులు కదుపుతున్నారు. ఎన్నికల నిర్వహణ పోల్ మేనేజ్‌మెంట్‌లో అందవేసిన చేయి నరేంద్ర కుమార్‌ది. రానున్న ఎన్నికలో విజయం నల్లేరు మీద నడకేనని రాజకీయ పరిశీలకులు అంచనాలు వేస్తున్నారు.



ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సమక్షంలో టీడీపీలో చేరిన వీవర్స్ కో ఆపరేటీవ్ సొసైటీ చైర్మన్, వైసీపీ నాయకుడు ప్రగడ వీరభద్ర బాలాజీ తదితరులు

పోలీసుల పోస్టల్ బ్యాలెట్..
అయోమయం

- 8 వ తేదీ కేటాయించిన అధికారులు....
- అదే రోజు ప్రధాని పర్యటన బందోబస్తు విధులు

గుంటూరు, మే6: పోలీస్ అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే విషయంలో అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకనేందుకు ఎన్నికల కమిషన్ మరో రెండు రోజులు గడువు ఇవ్వడంతో ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ నెల 7, 8తేదీల్లో ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని అధికారులు ప్రకటించారు. అయితే పోలీస్‌శాఖకు ఈ నెల 8ని కేటాయించారు. అదే రోజు ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటనకు వస్తున్న నేపథ్యంలో జిల్లాలోని అత్యధిక మందికి బందోబస్తు విధులు కేటాయించారు. దీంతో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో ప్రధాని బందోబస్తు విధులకు వెళ్ళే పోలీస్ సిబ్బందికి మరో రోజు కేటాయించాలని పోలీస్ సిబ్బంది కోరుతున్నారు.

వైసీపీలో అంతర్మథనం..

- టీడీపీలో ఉత్సాహం
- నియోజకవర్గంలో భారీగా మారిన సమీకరణాలు
- జనసేన కలయికతో భారీగా పెరగనున్న మెజారిటీ



ప్రత్తిపాడు, మే 30: అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి జగన్ ప్రత్తిపాడుకు ఇచ్చిన హామీలు నెరవేర్చ లేకపోవడం, బటన్ అయితే నొక్కుతున్నాడు కాని ఇంకా బ్యాంకు ఖాతాలకు డబ్బులు జమకాకపోవడం, యువతకు ఉద్యోగాలు ఇవ్వలేక పోవడం వంటి అనేక కారణాలు సామాన్యులను వైసీపీకి దూరం చేస్తున్నాయి. ఈ క్రమంలో చంద్రబాబు ఇచ్చిన హామీలపై ప్రజలకు ఉన్న విశ్వాసంతో పాటు స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి బూర్ల రామాంజనేయులుపై ఉన్న నమ్మకంతో తెలుగుదేశం పార్టీకి ప్రజలు దగ్గరవుతున్నారు. ఆమె ప్రత్తిపాడుకు ఏమీ చేయలేక పోగా, స్థానిక నాయకులకు కూడా దూరం కావాల్సి వచ్చింది. తమకు సబంధించి చిన్న చిన్న సమస్యలు కూడా తీర్చలేని స్థితిలో ఉన్న సుచరిత ప్రత్తిపాడుకు పూర్తి దూరం అయింది. దీంతో విజయవాడకు చెందిన బలసాని కిరణ్ కుమార్‌ను ప్రత్తిపాడుకు ఇన్‌చార్జిగా నియమించింది. పార్టీ అధికారంలో ఉండటంతో సైరన్ కారులో చక్కులు కొట్టడం, అధికారిక కార్యక్రమాలకు దర్జాగా హాజరవుతుండటం, అధికారులు సైతం ఎమ్మెల్యేగా బావించి సలాంలు కొట్టడంతో ఇక ఆయన ఎంఎమ్మెల్యే అయినట్టు బావించారు. ఈ క్రమంలో ఇక్కడ ఉన్న అసంతృప్తిపై ఆయన దృష్టి పెట్టకుండా తన సొంత బాణీలో అడుగులు వేశారు. దీంతో పార్టీ క్యాడర్ మొత్తం మౌనముద్రలో ఉండి పోయింది. చివరికి బలసానికే సీటు వరించినా ఇప్పటి వరకు ఆయన అందరికీ దూరం ఉండటంతో ఎవరూ కూడా ఆయన దగ్గర కాలేక పోయారు.

ఇదే క్రమంలో ప్రత్తిపాడుకు వచ్చిన బూర్ల రామాంజనేయులు ప్రజలతో మమేకమవుతున్న తీరు, ఒక అడ్మినిస్ట్రేటర్‌గా ఆయన వ్యవహరిస్తున్న హుందాతనం అటు తెలుగుదేశం క్యాడర్‌ను మరింత ఉత్సాహాన్నివ్వగా, ఇటు వైసీపీ సానుభూతి పరులతో పాటు ప్రజలకు ఒక నమ్మకాన్నిచ్చింది. దీనికి తోడు ఆయన గ్రామాల్లోనికి వచ్చిన సమయంలో ప్రజలతో మాట్లాడుతున్న తీరు, వారి సమస్యలు తెలుసుకోవడంతో పాటు అధికారంలోనికి రావడం తోనే ఆ సమస్యను ఏ విధంగా పరిష్కరించాలో కూడా అక్కడే దిశానిర్ధేశం చేసే విధానాలు అందరినీ తెలుగుదేశం పార్టీ వైపు అడుగులు వేసే విధంగా చేస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా వైసీపీ నుంచి భారీ స్థాయిలో వలసలు రావడం ఆ పార్టీని అగాధం లోనికి నెట్టేవిధంగా ఉండగా.. తెలుగుదేశం పార్టీని పతాక స్థాయిలో నిలుపుతుంది. మా నమ్మకం నువ్వే జగన్ అన్నవారు నేడు మా భవిష్యత్తుకు బాబు మాత్రమే గ్యారంటీ అంటూ టీడీపీ వైపు పరుగులు పెడుతున్నారు. అంతేకాకుండా ప్రత్తిపాడులో జనసేన ప్రభావం కూడా ఎక్కువగా ఉంది. ఇప్పుడు ఉమ్మడిగా పోటీచేయడంతో టీడీపీకి బలం రెట్టింపైంది. కొన్ని ప్రాంతాల్లోకి వైసీపీ నాయకులు అడుగు పెట్టడానికికూడా అవకాశం లేకుండాఉంది.

టీడీపీలోకి.. క్యూ


- వైసీపీని వీడుతున్న ముఖ్య నాయకులు
- క్యాడర్ కూడా అదే బాట
- తాడికొండలో ఖాళీ అవుతున్న వైసీపీ



తాడికొండ, మే6: ఎన్నికలు సమీపిస్తున్న వేళ తాడికొండ నియోజకవర్గంలో వైసీపీ శ్రేణులు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరువుతున్నారు. ఎన్నికలు ముగిసే నాటికి వైసీపీ పూర్తిగా ఖాళీ అవుతుందనే పరిస్థితి వచ్చింది. మాజీమంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ ఆ పార్టీని వీడి చంద్రబాబు నాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. తాడికొండలో జరిగిన వైసీపీ బస్సుయాత్రలో డొక్కా బహిరంగంగానే వైసీపీలో జరుగుతున్న పరిణామాలను వెల్లడించారు. కాగా ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, కత్తెర సురేష్‌కుమార్‌లు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కత్తెర సురేష్‌కుమార్‌ను తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించి అనంతరం ఆయనను తొలగించారు. పార్టీలో గౌరవం, విలువ లేదని పార్టీని వీడినట్లు తెలిపారు. 2019లో ఎమ్మెల్యేగా ఎన్నికైన డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి వైసీపీలో ఇమడలేక పార్టీని వీడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీకి అనుకూలంగా ఓటు వేశారనే నెపంతో శ్రీదేవిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. పార్టీ నుంచి సస్పెండ్ చేయకముందే లోకేష్ యువగళం పాదయాత్రలో అమరావతి రైతులకు మద్దతు తెలిపారు. తదనంతరం పార్టీని వీడి చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు.

జడ్పీటీసీ, సర్పంచ్‌లు టీడీపీలు చేరిక

తాడికొండ నియోజకవర్గంలో వైసీపీ తరపున పోటీచేసి గెలిచిన జడ్పీటీసీ, సర్పంచ్, మాజీ సర్పంచ్‌లు, తాడికొండ వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్లు, మాజీ ఛైర్మన్లు పార్టీలను విడిచిపెట్టారు. తాడికొండ జడ్పీటీసీ గుడిమెట్ల జ్యోతి, తాడికొండ వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ చిమటా పూర్ణచంద్రరావు, ముక్కామల సర్పంచ్ చిమటా వెంకటేశ్వర్లు, మాజీ మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ కొల్లికొండ క్రాంతివెంకటేశ్వరావు, మాజీ ఎంపీపీ కొమ్మినేని రామచంద్రరావు, వైసీపీ సర్పంచ్ అభ్యర్థులు, ఎంపీటీసీ అభ్యర్థులు, పార్టీ తరపున వివిధ హోదాల్లో పదవులు పొందిన వారు టీడీపీలో చేరారు. ఫిరంగిపురం మండలంలో దాదాపు 500 మంది వరుకు వైసీపీని వీడారు. గత ఎన్నికల్లో వైసీపీకి ఓట్లు వేసిన బీసీ సామాజిక వర్గాలు ఈ సారీ టీడీపీలోకి వచ్చారు. దీంతో టీడీపీకి నియోజకవర్గంలో పూర్తి పట్టు వచ్చింది. రాజధాని గ్రామాల్లో ప్రజలు వైసీపీపై పూర్తి వ్యతిరేకతతో ఉన్నారు. రాజధాని నిర్మాణం నిలిచిపోవటంతో, కూలీలు, కార్మికులకు పనులు లేక ఇతర జిల్లాలకు, రాష్ట్రాలకు వలసలు పోవాల్సి వచ్చింది. రాజధాని నిర్మాణం జరిగినట్లైతే ఎంతోమంది ఉపాధి లభించేదని రాజధాని గ్రామాల్లోని కార్మికులకు, వ్యవసాయ కూలీలకు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుచరిత కుటుంబ సభ్యులు నియోజకవర్గంలో పెత్తనం ఎక్కువగా ఉండటంతో ఆ పార్టీలోని ముఖ్యనాయకులు అసంతృప్తిలో ఉన్నారు. ప్రచార కార్యక్రమాలకు కూడా క్యాడర్ దూరంగా ఉంటున్నారు. పార్టీలో వర్గ విభేదాలు ఉండటం వలన ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేని పరిస్థితి. ప్రచారానికి స్పందన కూడా కరువుతుంది. మద్యం, బిర్యాని, నగదును వెదజల్లినా ఉపయోగం లేదని పార్టీ నాయకులు వాపోతున్నారు.



తాడికొండ అసెంబ్లీ నియోజకవర్గ మ్యాప్

గుంటూరు రూరల్ వార్తలు

లోకేశ్, పెమ్మసానిలను గెలిపించాలి

● జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాస్

తాడేపల్లి, మే 6: మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా నారా లోకేశ్‌ను, గుంటూరు ఎంపీ అభ్యర్థిగా పెమ్మసాని చంద్రశేఖర్‌లను భారీ మెజారిటీతో గెలిపించాలని మంగళగిరి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఎంటీఎంసీ పరిధిలోని కొలనుకొండ ఇప్పటం గ్రామాల్లో జనసేన పార్టీ తరఫున కూటమి నేతలతో కలి సి ప్రచారం నిర్వహించారు. చిల్లపల్లి మాట్లాడుతూ నియోజకవర్గంలో జనసేన క్యాడర్ బలంగా ఉందని, కొలనుకొండ జనసేనకు చాలా బలమైన గ్రామమని వ్యాఖ్యానించారు. భారీ మెజారిటీతో మంగళగిరిలో లోకేశ్‌ను గెలిపిస్తామని లోకేశ్‌కు ప్రజల అండదండలు ఆదరణ పుష్కలంగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో జనసేన, బీజేపీ, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

చిర్రావూరులో టీడీపీ, జనసేన నేతల ప్రచారం



చిర్రావూరులో ప్రచారం చేస్తున్న టీడీపీ, జనసేన శ్రేణులు

తాడేపల్లి, మే 6: ఎంటీఎంసీ పరిధిలోని చిర్రావూరు గ్రామంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు వీరిశెట్టి శ్రీనివాస్, జనసేన గ్రామ అధ్యక్షుడు అంకం కాళీకృష్ణ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా నారా లోకేశ్‌ను, గుంటూరు ఎంపీ అభ్యర్థిగా పెమ్మసాని చంద్రశేఖర్‌లను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను నారా లోకేశ్ ప్రకటించిన మంగళగిరి నియోజకవర్గ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్ర ప్రగతి, పురోగతి

● టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత



గొడవర్రులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కేసంనేని శ్రీఅనిత, టీడీపీ శ్రేణులు

దుగ్గిరాల, మే 6: రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తేనే పురోగతి సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత తెలిపారు. గొడవర్రులో స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ, టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి మేనిఫెస్టోలోని అంశాలను వివరిస్తూ కొనసాగిన ప్రచారానికి విశేష స్పందన లభిస్తోందన్నారు. దుగ్గిరాలలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఎన్నారై జంపాల సుబ్బారావు మాట్లాడుతూ నగరాల నుంచి, ఎంతో ఉత్సాహంగా ఓటు వేసేందుకు గ్రామాలకు వస్తున్న యువత టీడీపీ పట్ల సానుకూలంగా ఉన్నారని, అఖండ విజయం ఖాయమని అన్నారు. దుగ్గిరాలలో ఇంటింటి కీ తిరుగుతూ విస్తృతంగా నిర్వహించిన ప్రచారంలో టీడీపీ వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకట్రావు, మాజీ ఎంపీపీలు వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, ఉన్నం ఝాన్సీరాణి, గద్దె వాసు, దేవరపల్లి చంటి, ఉన్నం బాబూరావు, గోరంట్ల అనిల్‌కుమార్, పెండ్యాల బుజ్జి, నందేటి నిరీక్షణరావు, మాజీ సర్పంచ్ నల్లమ్మ, రేపల్లె విక్టోరియా, గొడవర్తి పున్నయ్య, రమేష్ మహిళలు, తెలుగుయువత, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్‌కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న జిల్లా పోలీస్ అబ్జర్వర్ సత్యార్థ్ అనిరుద్ధ పంకజ్

ప్రత్తిపాడు, మే 6: మండల పరిధిలోని సమస్యాత్మక గ్రామాల్లో ఎన్నికల పోలీసు పరిశీలకుడు సత్యార్థ్ అనిరుద్ధ పంకజ్ పర్యటించారు. ప్రత్తిపాడుతో పాటు కోయవారిపాలెం, పాతమల్లాయపాలెం, గొట్టిపాడు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఆ గ్రామాల్లో గతంలో జరిగిన సంఘటనలకు అడిగి తెలుసుకున్నారు. అంతే కాకుండా ప్రస్తుతం ఏక్కడైనా గొడవలు జరిగే అవకాశాలు ఏమైనా ఉన్నాయా అని ప్రత్తిపాడు సీఐ నిస్సార్ బాషాను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎస్ఐ సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి కొండపాటూరు మాజీ సర్పంచ్ దంపతులు



మాజీ సర్పంచ్ కామేశ్వరి దంపతులకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న రామాంజనేయులు

కాకుమాను, మే 6: మండలపరిధిలోని కొండపాటూరు మాజీ సర్పంచ్ యర్రాకుల కామేశ్వరి, ఆమె భర్త శ్రీనివాసరావు వైసీపీ నుంచి వైదొలగి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. సోమవారం టీడీపీ అభ్యర్థి రామాంజనేయులు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు పొన్నం శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు దానయ్య, మాణిక్యరావు, తదితరులు పాల్గొన్నారు.

పెదనందిపాడు మండలంలో చేరికలు

మండలపరిధిలోని ఉప్పలపాడు, పెదనందిపాడు గ్రామాలకు చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. విద్యాకమిటీ చైర్మన్ గుండ్రా పాపారావు, మరో 20 మందికి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బూర్ల రామాంజనేయులు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రజా ఎదుగుదలే లక్ష్యంగా ఎన్నికల్లో పోటీ

● ఆంధ్ర రాష్ట్ర సమితి అధ్యక్షుడు కోటేశ్వరరావు



మాట్లాడుతున్న ఆంధ్ర రాష్ట్ర సమితి అధ్యక్షుడు కోటేశ్వరరావు

మంగళగిరి, మే 6: సామాన్య ప్రజల ఎదుగుదలే లక్ష్యంగా సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్టు ఆంధ్ర రాష్ట్ర సమితి అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు తెలిపారు. మంగళగిరి బైపాస్ రోడ్డులోని సమితి రాష్ట్ర కార్యాలయంలో సోమ వారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా ఎదుగుదల యాత్ర చేపట్టినట్టు తెలిపారు. పేదలను కోటేశ్వరులను చేయడంతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధి కారం కట్టబెట్టడమే ఆంధ్ర రాష్ట్ర సమితి ధ్యేయమన్నారు. తెలుగు రాజ్యా ధికార సమితి పార్టీ తరఫున పోటీ చేస్తున్న తమ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన 11అంశాలపై ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంద న్నారు. మంగళగిరి, అమరావతి ప్రాంతాలు అభివృద్ధి సాధించాలంటే తమ అభ్యర్థిని గెలిపించాలని ఆయన కోరారు.

712 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, మే 6: స్థానిక పసుపు మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన వేలంలో 712 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.12,700 గరిష్ఠధర రూ.14,440 మోడల్ ధర రూ.14,100 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.11,700 గరిష్ఠధర రూ.14,440, మోడల్‌ధర రూ.14,100 పలికాయి.

నీతి, నిజాయితీ, ధర్మం వైపు ప్రజలు నిలబడాలి

● గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్

● తాడికొండ మండలంలో ఎన్నికల ప్రచారం

● రోడ్‌షోలో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి శ్రావణ్‌కుమార్



నిడుముక్కల రోడ్ షోలో మాట్లాడుతున్న ఎన్‌డీఏ కూటమి ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్

తాడికొండ, మే 6: నీతి, నిజాయతీ, ధర్మం వైపు ప్రజలు నిలబడాలని ఎన్‌డీఏ కూటమి ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం తాడికొండ మండలంలోని ముక్కామల, మోతడక, నిడుముక్కల, బడేపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్ షోను నిర్వహించారు. రోడ్‌షోకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ముందుగా ముక్కామల మీదుగా లచ్చనగుడిపూడి, మోతడక, నిడుముక్కల, బడేపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినిమాల టికెట్ రేట్లు తగ్గిస్తామని వారిని గుప్పిట్లో పెట్టుకున్నారన్నారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలోని ఆక్వా రైతులను భయపెట్టారన్నారు. సర్వే రాళ్లపై పేర్లు, పాస్‌పుస్తకాలపై వాళ్ల బొమ్మలు వేసుకున్నారు. భూములను సర్వే చేసి డేటా అంతా సేకరించి ఎవరి స్థలాలు, ఎవరి పొలాలు ఎంత ఉన్నాయో తెలుసుకున్నారు. ఇప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి స్టాంపు పేపర్లు వారి వద్ద ఉంచుకుంటారని చెప్తున్నారు. మన ఇంటి బీరువాలో ఉన్న స్టాంపు పేపర్లను నకిలీవి సృష్టించి అస్తులు అమ్ముకుంటున్న పరిస్థితి ఉందన్నారు. అధికారుల వద్ద కిరికిరి పెడితే న్యాయవ్యవస్థలు ఏమైపోవాలని.. మీరు ఎవరి దగ్గరకు వెళ్లాలని ప్రశ్నించారు. న్యాయమూర్తులుగా ఆళ్ల రామకృష్ణారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డిలు ఒక్కొక్క జిల్లాను అప్పజెప్పి వాళ్లనే న్యాయమూర్తులు చేసి ప్రధాన న్యాయమూర్తిగా జగన్మోహన్ రెడ్డి అయిపోయిన పరిస్థితి అని విమర్శించారు. ప్రభుత్వం మారిన తరువాత అధికారులు జైళ్ల పాలయ్యే పరిస్థితి ఉందన్నారు. ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులుగా మేము గెలవబోతున్నామని తెలిపారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో వేసిన రోడ్లు మినహా వైసీపీ ప్రభుత్వంలో సీసీ రోడ్లు వేసిన పాపాన పోలేదన్నారు. తాగునీటి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జలజీవన్ మిషన్‌లో వేలకోట్ల రూపాయలు వాడుకోకుంటే ప్రతి ఇంటికి కుళాయి వచ్చేదన్నారు. సంక్షేమ పథకాలు ఇస్తే ఓట్లు వేస్తారనే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. రాజధాని లేదు, పరిశ్రమలు లేవు, ప్రతి వీధిలో గంజాయి, లిక్కర్ తీసుకువచ్చి ప్రజలను నాశనం చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత పేదలకు 2 సెంట్ల భూమిని ఇచ్చి ఇళ్లు కట్టిస్తామని చెప్పారు. ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నియోజక వర్గంలో నీటి సమస్యను తీర్చుతామన్నారు. రాజధానిని అభివృద్ధి చేసి కార్మికులకు ఉపాధి కల్పిస్తామన్నారు. రాష్ట్రాభివృద్ధిని అడ్డుకున్న వైసీపీని రాష్ట్రం నుంచి తరిమి కొట్టాలన్నారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి పెమ్మసాని చంద్రశేఖర్‌ను, ఎమ్మెల్యేగా తనని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు, మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, జడ్పీటీసీ గుడిమెట్ల జ్యోతి, కంచర్ల శివరామయ్య, నీలాల కృష్ణారావు, గుంటుపల్లి మధుసూదనరావు, గడ్డిపాటి సాంబశివరావు, దగ్గుమల్లి శ్రీనివాసరావు, ఇంకొల్లు అనిల్‌కుమార్, కొమ్మినేని పున్నారావు, యడ్లపల్లి సాంబశివరావు, తాటి తులసీరామ్, ఎడ్డూరి హనుమంతరావు, మన్నె రమేష్‌బాబు, బండ్ల కోటేశ్వరరావు, వీ కోటేశ్వరరావు, చిగురుపాటి అనూఫ్, షేక్ రిజ్వాన, జనసేన నియోజకవర్గ కన్వీనర్ బేతపూడి విజయ్‌శేఖర్, మండల అధ్యక్షుడు నరేష్‌కుమార్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన మార్కెట్‌యార్డు చైర్మన్ పూర్ణచంద్రరావు

తాడికొండలో వైసీపీకి ఎదురుదెబ్బ గట్టిగా తగిలింది. ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు టీడీపీలో చేరారు. తాడికొండ వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ చిమటా పూర్ణచంద్రరావు, ముక్కామల సర్పంచ్ చిమటా వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు చింకా పున్నారావులతో పాటు మరో 50 కుటుంబాలు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని, ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్ సమక్షంలో పార్టీలో చేరారు. మోతడకలో బోయపాటి సాంబశివరావు, కంచర్ల రవికుమార్, యడ్లపల్లి శ్రీధర్‌లు టీడీపీలో చేరారు.



ఏఎంసీ చైర్మన్, ముక్కామల సర్పంచ్‌కి టీడీపీ కండువాకప్పి ఆహ్వానిస్తున్న శ్రావణ్‌కుమార్

కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి

● కాకుమాను, పెదనందిపాడు, మండలాల్లో ఎన్నికల ప్రచారంలో అసెంబ్లీ అభ్యర్థి రామాంజనేయులు



కొండపాటూరులో ప్రచారరథంపై ప్రజలకు అభివాదం చేస్తున్న రామాంజనేయులు

కాకుమాను, మే 6: మరో వారం రోజుల్లో జరిగే సార్వత్రిక ఎన్నికలకు ప్రతి కార్యకర్త అప్రమత్తంగా ఉండాలని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి పార్టీల అసెంబ్లీ అభ్యర్థి, మాజీ ఐఏఎస్ అధికారి బూర్ల రామాంజనేయులు అన్నారు. మండలపరిధిలోని గార్లపాడు, కొండపాటూరు, చిన్నలింగాయపాలెం గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లోని దేవాలయాల్లో పూజలు చేశారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొండపాటూరులో యాదవ సామాజిక వర్గం నాయకులు బూర్ల రామాంజనేయులకు గొర్రెను బహూకరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి పార్టీల ప్రత్తిపాడు అసెంబ్లీ అభ్యర్థి రామాంజనేయులు మాట్లాడుతూ టీడీపీ విజయం దాదాపు ఖాయమైందని తెలిపారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను విమర్శిస్తున్న జగన్ తను అమలు చేసిన సంక్షేమ పథకాలకు నగదు లేకుండా బటన్‌లు ఎందుకు నొక్కారని ప్రశ్నించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు ద్వారా ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోతుందని ప్రజలకు వివరించారు. దళితులకు 27 రకాల సంక్షేమ పథకాలు రద్దు చేసిన జగన్‌కు దళితులు ఓట్లు ఎందుకు వేయాలో ఆత్మపరిశీలన చేసుకోవాలని కోరారు. వచ్చే సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికల్లో అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులైన పెమ్మసాని చంద్రశేఖర్, రామాంజనేయులును అధిక మెజారిటీతో గెలిపించడానికి బీజేపీ, జనసేన, టీడీపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నువ్వుల సునీల్ చౌదరి, జనసేన మండల అధ్యక్షుడు గడ్డం శ్రీనివాసరావు, నాయకులు కొల్లా వీరయ్య చౌదరి, మామిళ్లపల్లి రాంగోపాల్, నక్కల అగస్టీన్, జాష్టి వీరయ్య చౌదరి, గార్లపాడు సర్పంచ్ రామినేని సురేష్, చిన్నలింగాయపాలెం సర్పంచ్ యోహాను, కొండపాటూరు సర్పంచ్ యర్రాకులు సుజాత, దానయ్య, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బటన్ నొక్కుడుకే పరిమితమైన వైసీపీ ఐదేళ్ల పాలన

పెదనందిపాడు, మే 6 : వైసీపీ ఐదేళ్ల పాలన బటన్ నొక్కుడుకే పరిమితమైందని బూర్ల రామాంజనేయులు ఆరోపించారు. పెదనందిపాడులో సోమవారం రాత్రి స్థానిక నేతలతో కలిసి ప్రచార రథంపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పులపాలైన ఆంధ్ర రాష్ట్ర పురోగతి కూటమి విజయంతోనే సాధ్యమని, ప్రజలందరూ పోటీలో ఉన్న అభ్యర్థులు, మేనిఫెస్టోను పరిశీలించి తమ అమూల్యమైన ఓటును సద్వినియోగించుకోవాలన్నారు. దేశంలో ఎక్కడికి వెళ్ళిని మీ రాష్ట్ర రాజధాని ఏది అంటే తలదించుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. కూటమి అధికారంలోకి రాగానే గుంటూరు ఛానెల్ పొడిగింపు పనులు చేపట్టి తాగు, సాగునీటి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ, ముద్దన నగరాజకుమారి, మోపర్తి చెంచయ్య, రావి శివరామకృష్ణయ్య, చాగంటి సత్యహర్ష, కాంద్రు ప్రసాద్, మాదినేని శౌరిబాబు, కుర్రా హరిబాబు, ధూళిపాళ్ళ మోహనరావు, నూతి శ్రీనివాసరావు, దివ్వి నాగరాజు, కట్టా రామరాజు, కట్టా మనోహర్, లావు శ్రీనివాసరావు, ముద్దన రాఘవయ్య,షేక్ ఖలీల్, గాల్మేలు నాగయ్య, విక్రయాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బలిజ, కాపు, ఒంటరి, తెలగలకు జగన్ వెన్నుపోటు

● కాపు జేఏసీ నేతలు వాసిరెడ్డి ఏసుదాసు, ఆరేటి ప్రకాష్



సమావేశంలో మాట్లాడుతున్న కాపు జేఏసీ నేతలు ఏసుదాసు, ప్రకాష్

మంగళగిరి సిటీ, మే 6: రాష్ట్రంలో బలిజ, కాపు, ఒంటరి, తెలగ సామాజిక వర్గాలకు సీఎం జగన్ వెన్నుపోటు పొడిచారని కాపు జేఏసీ రాష్ట్ర కన్వీనరు వాసిరెడ్డి ఏసుదాసు, కాపు జేఏసీ (ఫోరం ఫర్ బెటర్ ఏపీ) రాష్ట్ర కన్వీనరు ఆరేటి ప్రకాష్ మండిపడ్డారు. మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వం కాపులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తే జగన్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నుంచి జగన్ దాకా బలిజ, కాపు, ఒంటరి, తెలగలకు అన్ని రంగాల్లోనూ అన్యాయం జరిగిందని, ఆర్థిక, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో గండికొట్టారని, కాపు రిజర్వేషన్లను సైతం భ్రష్టు పట్టించారని విమర్శించారు. ఈడబ్ల్యూఎస్ కోటాలో టీడీపీ ప్రభుత్వం కాపులకు అమలు చేసిన 5 శాతం రిజర్వేషన్లనూ రద్దు చేశారని, దీనివల్ల 30 వేల మంది యువత ఉద్యోగాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో 500 కాపు భవనాలను మంజూరు చేస్తే జగన్ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకుండా నిలిపివేయడం దుర్మార్గమన్నారు. కాపు నేస్తం 65లక్షల మందికి అమలు కావలసి ఉండగా, కేవలం 2.35 లక్షల మందికి మాత్రమే ఇస్తున్నారని చెప్పారు. మంగళగిరిలో లోకేశ్ గెలిస్తే ఈ ప్రాంతం పర్యాటక కేంద్రంగాను, ఐటీ హబ్‌గాను అభివృద్ధి చెందుతుందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బలిజ, కాపు, తెలగలు వైసీపీకి ఓటు వేయొద్దని, కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తెలుగుమహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, జనసేన మండ ల అధ్యక్షుడు వాసా శ్రీనివాసరావు, దక్షిణ భారత కాపు వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు విన్నకోట శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలరు రంగిశెట్టి నరేంద్ర (బాబీ), అమరావతి జేఏసీ నేత ఆకుల ఉమామహేశ్వరరావు, జనసేన ఎంటీఎంసీ కార్యదర్శి దాసరి వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ పల్నాటి నాగేశ్వర రావు, నేతలు రంగిశెట్టి పెద్దబ్బాయ్, అడపా నరసింహారావు, కనుకుర్తి కృష్ణ, వాసా పద్మావతి, సుంకర బాబు, లింగినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జరిగిన నష్టం చాలు.. ఇకనైనా మేల్కొందాం

● బీసీలంతా ఏకమై వైసీపీని సాగనంపుదాం

● కూటమి అభ్యర్థులను గెలిపించుకుందాం

● మాజీ జడ్పీటీసీ సభ్యుడు సాంబశివరావు



వెలవర్తిపాడులో ఇంటింటి ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

మేడికొండూరు, మే 6: రాష్ట్రంలోని బీసీ, మైనారిటీలకు జరిగిన నష్టం చాలని, ఇకనైనా మేల్కొనాలని, బీసీలంతా ఏకమై వైసీపీని తరిమికొట్టాలని బీసీ నాయకుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు గుంటుపల్లి సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. మండలంలోని వెలవర్తిపాడు గ్రామంలో సోమవారం ఆయన టీడీపీ నాయకులతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలను మాయమాటలతో మోసం చేసి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి చేసిందేమి లేదని, కులం పేరుతో పేదలకు కార్పొరేషన్‌లు పెట్టి, వాటిని ఎందుకు పనికి రాకుండా చేసి దగా చేశారన్నారు. వనరులను దోచుకోవడం, దాచుకోవడం మినహా వైసీపీ నాయకులు ప్రజలకు చేసిందేమి లేదని ఆరోపించారు. జగన్ పరిపాలన ప్రజల పాలిట శాపంగా మారిందని, అమరావతి ప్రజా రాజధానిని నామ రూపాలు లేకుండా చేయడానికి జగన్ చేయని ప్రయత్నం లేదని, ఇప్పటికే అమరావతి పూర్తయి ఉంటే రాష్ట్ర భవిష్యత్తు అద్భుతంగా ఉండేదని, కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన భవనాలు నిరుపయోగంగా పడి ఉన్నాయని తెలిపారు. ప్రకృతి ప్రసాదించిన ఇసుక దోపిడి చేసి స్థానిక భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేకుండా చేసిన దుర్మార్గుడు జగన్మోహన్‌రెడ్డి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక, మద్యంపై వచ్చిన ఆదాయాన్ని ఎక్కడ దాచిపెట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ ప్రభుత్వం రాగానే భవిష్యత్తు గ్యారెంటీ, సూపర్ సిక్స్ పథకాల ద్వారా ఇంటింటికి సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. ఇంటింటికి తిరుగుతూ ఉమ్మడి మేనిఫెస్టోలోని పథకాలను ఓటర్లకు వివరిస్తూ తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, తాడికొండ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి తెనాలి శ్రావణకుమార్‌లను భారీ మెజారిటీతో గెలిపించాలని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించుకుందాం

● అమరావతిని నిలబెట్టుకుందాం

● ఇంటింటికి ప్రచారంలో రాజధాని మహిళలు



సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తున్న రాజధాని మహిళలు, టీడీపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు

తుళ్లూరు, మే 6: ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించి అమరావతిని నిలబెట్టుకుందామని తుళ్లూరు గ్రామ టీడీపీ ఆధ్వర్యంలో జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులు మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని ప్రచారం చేశారు. టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను ఇంటింటికి వివరించారు. అదేవిధంగా ఎస్సీలకు బీసీలకు ప్రవేశపెట్టిన ప్రత్యేక సంక్షేమ పథకాల గురించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ పథకాలు పేదల ఆర్థిక స్థితిని మెరుగుపరచటానికి చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టారన్నారు. రాష్ట్ర ప్రజలు ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్, గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రచారంలో తుళ్ళూరు గ్రామ టీడీపీ కాటా అప్పారావు, మాజీ ఎంపీటీసీ జొన్నల గడ్డ కిరణ్, మేకల చిన్నాబ్బాయి సొసైటీ మాజీ అధ్యక్షుడు బండ్ల శ్రీనివాసవరావు, నాయకులు బండ్ల పట్టయ్య, పువ్వాడ గణేష్, కొల్లి నరేంద్ర, జమ్ముల అనిల్, దళిత నాయకులు మేరిగ నాగేశ్వరరావు, జెట్టి దుర్గారావు, కంతేటి తిరుమల బాబు, మేకల చిన్నాబ్బాయి, అధికసంఖ్యలో రాజధాని అమరావతి మహిళలు, దళిత మహిళా జేఏసీ కన్వీనర్ అంకం సువర్ణ కమల, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య, మండల అధ్యక్షుడు నీరుకొండ లక్ష్మీనారాయణ, జనసేన నాయకులు బేతు సురేంద్ర బాబు, చిక్కాల నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు లోకేశ్ కుటుంబ సభ్యుల పర్యటన

మంగళగిరి సిటీ, మే 6: మంగళగిరి నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నారా లోకేశ్ తరఫున ఆయన కుటుంబసభ్యులు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారని టీడీపీ నియోజకవర్గ సమన్వయ కర్త నందం అబద్దయ్య తెలిపారు. ఉదయం 6:30 గంటలకు మంగళగిరి లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 7:30 గంటలకు పట్టణంలోని 10, 11 వార్డులలో ఎన్నికల ప్రచారం చేస్తారు. సాయంత్రం 5 గంటలకు తాడేపల్లి పట్టణం బ్రహ్మానందపురంలో జరిగే ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని తెలియజేశారు.

ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయం ఖాయం

● తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుట్టి రామచంద్రరావు



పెదపరిమిలో టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికి వివరిస్తున్న పుట్టి రామచంద్రరావు

తుళ్లూరు, మే 6: కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలను తానే ఇస్తు న్న ట్టు సీఎం జగన్‌రెడ్డి అబద్దాలడుతూ ప్రచారం చేసుకుంటున్నాడని టీడీపీ జనసేన బీజేపీ నేతలు అన్నారు. సోమవారం పెదపరిమి గ్రామంలో టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించారు ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్, ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు పుట్టి రామచంద్రరావు, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు సరిపూడి సాంబశివరావులు మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి అభ్యర్థులు రాష్ట్రంలో విజయ ఢంకా మోగించటం ఖాయమన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయటం తథ్యమన్నారు. ప్రతి సర్వే కూటమి గెలుస్తుందని చెపుతుందన్నారు. మూడు పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పెమ్మసాని, బూర్ల గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

● చింతపల్లిపాడులో ఇంటింటా ప్రచారం

వట్టిచెరుకూరు, మే 6: మండలపరిధి చింతపల్లిపాడు గ్రామంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు కుర్రా ఏసుబాబు మాజీ సర్పంచ్ మన్నవ చంద్రమౌళిల ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఉమ్మడి కూటమి మేనిఫెస్టోలో రూపొందించిన అంశాలను వివరించుతూ ఇంటింటా ప్రచారంలో సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను అందజేశారు. ప్రతిఒక్కరూ వాస్తవాలను గుర్తించి అభివృద్ధి, సంక్షేమానికే ప్రాధాన్యమిచ్చే కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మన అందరిపైన ఉన్నదని మాజీ సర్పంచ్ మన్నవ చంద్రమౌళి పిలుపునిచ్చారు. ఇంటింటి ప్రచారంలో గ్రామ ఉపసర్పంచ్ మన్నవ శంకరరావు, బీఎల్‌వోలు మన్నవ సాంబశివరావు, స్టాలిన్‌బాబు, మన్నవ నరేష్, శ్రీనివాస్, కె.వెంకటరావు, అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

గ్రామాల్లో జోరుగా ప్రచారాలు

పెదనందిపాడు, మే 6: మండలపరిధిలోని నాగులపాడు, కొప్పర్రులో టీడీపీ ఆధ్వర్యంలో సోమవారం జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ టీడీపీ సూపర్ సిక్స్, ఉమ్మడి మేనిఫెస్టో కరపత్రాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బత్తిని శారదావేణు, సంగం డెయిరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు, బండి నాగబాబు, యేలూరి గోపీప్రసాద్, నాయకులు ఆళ్ళ ఫణిబాబు, బండి కిరణ్‌కుమార్, కలవకూరి వెంకట్రావు, ఈదర నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కుంచనపల్లిలో సీపీఎం శ్రేణుల ప్రచారం

తాడేపల్లి, మే 6: ఇండియా కూటమి బలపరిచిన మంగళగిరి నియోజకవర్గ సీపీఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్న జొన్నా శివశంకర్, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జంగాల అజయ్‌కుమార్‌లను గెలిపించాలని కోరుతూ సీపీఎం శ్రేణులు కుంచనపల్లి గ్రామంలో సోమవారం ప్రచారం నిర్వహించారు. ప్రజాసమస్యల పరిష్కారానికి వామపక్ష అభ్యర్థులను గెలిపించాలని గ్రామాల్లో అభివృద్ధి జరగాలంటే నియోజకవర్గ ఎమ్మెల్యేగా జొన్నా శివశంకర్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.నళినీకాంత్, సీపీఎం నేతలు ముత్యాలరావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి బహిరంగ సభను జయప్రదం చేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ నేతలు

మంగళగిరి సిటీ, మే 6: ఇండియా బ్లాక్ వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన సాయంత్రం తాడేపల్లి పట్టణంలోని కృష్ణుడి గుడి సెంటర్లో జరుగనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. బహిరంగ సభ కరపత్రాలను మంగళగిరి సీపీఎం కార్యాలయంలో సోమవారం కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ పదేళ్ల బీజేపీ పాలనలో దేశ వ్యాపితంగా అన్ని వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. బీజేపీ పాలన భారత రాజ్యాంగ, లౌకిక, ప్రజాస్వామ్య వ్యవస్థలకు విఘాతం కలిగించేలా వుందన్నారు. రాష్ట్రంలో వైసీపీ, టీడీపీలు ఇక్కడ ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ ఢిల్లీలో బీజేపీకి మద్దతు పలుకుతున్నాయని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో వామపక్ష, ప్రజాతంత్ర లౌకిక శక్తులను, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం అభ్యర్థులను గెలిపించుకోవలసిన అవసరం ఉందన్నారు. మంగళగిరి సీపీఎం అభ్యర్థి జొన్నా శివశంకరరావు, గుంటూరు పార్లమెంటు అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్‌లను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. 8న జరిగే బహిరంగ సభలో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు పీ మధు తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ సలీమ్, పట్టణ అధ్యక్షుడు జీవన్ సాగర్, ఇండియా కూటమి నేతలు వై.వెంకటేశ్వరరావు, చెంగయ్య, ఈమని అప్పారావు, జేవీ రాఘవులు, హనుమంతరావు, రాధిక తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



నర్సిరెడ్డిని సత్కరిస్తున్న కూటమి నాయకులు

కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యం

● టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి

తెనాలి రూరల్, మే 6: అభివృద్ధి సంక్షేమం వైపు నడిపించగలిగిన సత్తా కలిగిన కూటమి అభ్యర్థులను గెలిపించి, రాష్ట్రంలో సుపరిపాలనకు బాటలు వేయాలని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. తెనాలి చెంచుపేటలోని రావి కన్వెన్షన్ హాల్లో కూటమి పార్టీ శ్రేణులతో సోమవారం ప్రత్యేక సమావేశం జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నర్సిరెడ్డి మాట్లాడుతూ అవినీతిమయమైన వైసీపీ ఐదేళ్ల పాలన చూశాం, మట్టినుంచి ఇసుక వరకూ అన్నీ దోచుకోవటం.. దాచుకోవటమే.. పేరుకేమో పేదల సంక్షేమం.. వాస్తవంలో మాత్రం పేదల బతుకులు ఛిద్రం, సంక్షేమం అభివృద్ధి రెండు కళ్లు అన్నారు. అప్పుల ఊబిలోకి రాష్ట్రాన్ని నెట్టి సంక్షోభపాలనకు తెరలేపారన్నారు. ప్రజలందరూ ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. భయాన్ని వీడాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో బాధ్యతగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనను ఒక్కసారి గుర్తు చేసుకోవాలన్నారు. ఉమ్మడి కూటమి అభ్యర్థుల గెలుపు రాష్ట్రానికి, ప్రజలకు అవసరమన్నారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉమ్మడి అభ్యర్థుల గెలుపునకు సైనికుల్లా పోరాడాలన్నారు. వైసీపీ ఎన్ని ఎత్తుగడలు వేసినా ఎప్పటికప్పుడు వాటిని చిత్తుచేస్తూ ఐదేళ్ళ పాలనలో రాష్ట్రానికి ప్రాంతానికి, ప్రజలకు జరిగిన నష్టాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. కూటమి అభ్యర్థుల గెలుపుతో రాష్ట్రంలో జరిగే అభివృద్ధి, ప్రజలకు జరిగే మంచిని వివరిస్తూ సూపర్ సిక్స్ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అభ్యర్థులకు కేటాయించిన గుర్తులపై ప్రజల్లో అవగాహన పెంచుతూ అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన కోరారు. తొలుత తెనాలి వచ్చిన నర్సిరెడ్డిని కూటమి నాయకులు ఘనస్వాగతం పలికి ఆయనను దుశ్శాలువాలతో సత్కరించి పుష్పగుచ్చాలు అందించారు. కార్యక్రమంలో రావి భగవత్‌దత్, రావి తేజ, అన్నాబత్తుని జయలక్ష్మి, కౌన్సిలర్ బోయపాటి అరుణ, బండ్లమూడి బాస్కర్‌రావు, కోగంటి వెంకటేశ్వరరావు, మంగమూరి యుగంధర్, హరిబాబు, అన్నాబత్తుని శ్రావణ్‌కుమార్, బొల్లినేని బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మనోహర్‌ను కలిసిన రావి వెంకటరమణ



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న రావి వెంకటరమణ, నాదెండ్ల మనోహర్

తెనాలి రూరల్, మే 6: జనసేన పీఏసీ చైర్మన్, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్లమనోహర్‌ను పత్తిపాడు మాజీ ఎమ్మెల్యే టీడీపీ నాయకులు రావి వెంకటరమణ సోమవారం కలిశారు. తెనాలి జనసేన పార్టీ కార్యాలయానికి విచ్చేసిన రావి వెంకటరమణను ఆత్మీయంగా పలకరిస్తూ నాదెండ్ల మనోహర్ స్వాగతం పలికారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో, జిల్లాలో నెలకొని ఉన్న పరిస్థితులపై చర్చించారు. కూటమి అభ్యర్థుల విజయానికి అనుసరించాల్సిన కార్యాచరణపై మంతనాలు జరిపారు.

గెలుపుకోసం ఐక్యంగా పనిచేయాలి: రావి

తెనాలి రూరల్, మే 6: కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంగా ముందుకు నడవాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు రావి వెంకటరమణ పిలుపునిచ్చారు. సోమవారం తెనాలి చెంచుపేటలో నూతనంగా ఏర్పాటుచేసిన టీడీపీ ఎన్నికల ప్రచార కార్యాలయాన్ని రావి వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ఈ ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలన్నారు. వైసీపీ పాలనలో పెరిగిన నిత్యావసరాల ధరలు, సాగునీరు లేక అన్నదాతలు, పరిశ్రమలు లేక నిరుద్యోగుల వలసలు ఇలా రాష్ట్రంలో ఎన్నో సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారన్నారు. అంతేకాక రౌడీయిజంతో ఇదే పాలన కొనసాగితే ప్రజల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తెనాలిలో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న నాదెండ్ల మనోహర్‌ను, ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్ గెలుపునకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని అయన పిలుపునిచ్చారు. తొలుత వెంకటరమణ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రోగులకు మజ్జిగ పంపిణీ

తెనాలి, మారీసుపేట మే 6: స్థానిక చెంచుపేటలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో సోమవారం కృష్ణ రాజగోపాల్ చారిటబుల్ ట్రస్ట్ వారు రోగులకు చల్లని మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యుడు సాతులూరి శ్రీనివాస శేషసాయి మాట్లాడుతూ దాతలు, ట్రస్ట్ సభ్యుల సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా ఎండ వేడిమికి రోగుల దాహార్తిని తీర్చడానికి చల్లని మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

బోసురోడ్డులో..

తెనాలి, మారీసుపేట మే 6: స్థానిక బోసురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద అన్నదాత సుఖీభవ తెనాలి వారి ఆధ్వర్యంలో చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు. సోమవారం అన్నదాత సుఖీభవ సభ్యులు దండమూరి వెంకటేశ్వరరావు 3వ వర్ధంతి సందర్భంగా ఆయన భార్య కృష్ణకుమారి, కుటుంబ సభ్యులు, కాకర్ల చైతన్యకుమార్ పుట్టినరోజు సందర్భంగా బాబాయి, పిన్ని కాకర్ల మురళిబాబు, శ్రీవాణి దంపతులు, రాచకొండ మురళి కృష్ణకుమార్, శ్రీలక్ష్మి, వినూత్న, తన్మయల సహకారంతో చల్లని మజ్జిగను పాదచారులకు, పట్టణ ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్.మురళి కృష్ణకుమార్, వీవీ ప్రతాప్, కుర్రా శ్రీనివాసరావు, కాకర్ల మురళిబాబు, పోతరాజు, బాలునాయక్, శ్రీను, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



డాక్టర్ భవానీ శంకర్‌కు గోల్డ్‌మెడల్ అందజేస్తున్న వైద్యులు

రేడియాలజీలో ఆధునిక వైద్యంపై సదస్సు

తెనాలి అర్బన్, మే 6: బోసురోడ్డులోని ఐఎంఏ హాలులో సోమవారం రాత్రి రేడియాలజీ విభాగంలో వస్తున్న అధునాతన విధానంపై సదస్సు నిర్వహించారు. డాక్టర్ వి.సుందరరామయ్య స్మారక గోల్డ్‌మెడల్ ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. విజయవాడకు చెందిన వైద్యుడు డాక్టర్ భవానీ శంకర్ రేడియాలజీ విభాగంలో ఆధునిక వైద్య విధానం-అంతర్జాతీయ పాత్ర అనే అంశంపై ప్రసంగించారు. ఆయనకు డాక్టర్ సుందరరామయ్య స్మారక బంగారు పతకాన్ని ప్రదానం చేశారు. ఐఎంఏ అధ్యక్షురాలు విజయలక్ష్మి, ఉపాధ్యక్షుడు అనీల్‌కుమార్, వైద్యులు శ్యామ్‌ప్రసాద్, సాంబశివుడు, పావని ప్రియాంక, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై బ్లేడ్‌తో దాడి



దుండగుల దాడిలో గాయపడిన కోటిబాబు

తెనాలి, మారీసుపేట మే 6: వ్యక్తిపై బ్లేడ్‌తో దాడిచేసి గొంతు కోసిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. సోమవారం త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరముల ప్రకారం ఆదివారం రాత్రి దాచేపల్లి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన క్యాటరింగ్ కార్మికుడు గురజాల కోటిబాబు తెనాలిలో పనిముగించుకొని రైల్వే స్టేషన్ వంతెన సమీపంలో భోజనం చేస్తుండగా నలుగురు వ్యక్తులు అతనిపై దాడిచేసి బ్లేడ్‌తో గొంతు, పొట్ట భాగంలో కోసి తీవ్రంగా గాయపరచి అతని వద్ద ఉన్న రూ.1800 నగదును, ఫోన్‌ను తీసుకొని పారిపోయారన్నారు. గాయాలతో ఉన్న బాధితుడుని త్రీటౌన్ పోలీసులు జిల్లా ప్రభుత్వ వైద్యశాల తరలించగా వైద్యులు వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

భూ హక్కు చట్టం అమలును రద్దు చేస్తాం

జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అభ్యర్థి మనోహర్



ఎన్నికల ప్రచారంలో మహిళలతో మాట్లాడుతున్న నాదెండ్ల మనోహర్, డాక్టర్ శ్రీరత్న

కొల్లిపర, మే 6: ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అత్యంత దుర్మార్గమైన చట్టమని దీనివలన రైతులు తీవ్రంగా నష్టపోతారని రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం రాగానే ఆ చట్టాన్ని వెంటనే రద్దు చేయనున్నట్లు జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చారు. సోమవారం మండల పరిధిలోని పిడపర్తిపాలెం, పిడపర్రు, మున్నంగి గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి పార్టీల అభ్యర్థి నాదెండ్ల మనోహర్, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ సతీమణి డాక్టర్ శ్రీరత్న ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ రాష్ట్రం కోసం, భావితరాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కూటమి అభ్యర్థులను గెలిపించు కోవాలన్నారు. వైసీపీ పరిపాలనతో రాష్ట్రం మరో 15 సంవత్సరాలు వెనకబడిపోయాయన్నారు. డాక్టర్ శ్రీరత్న మాట్లాడుతూ రాష్ట్రం చంద్రబాబు నాయకత్వంలోనే మరింత అభివృద్ధి చెందను



గాజుగ్లాసు గుర్తుపై అవగాహన కల్పిస్తున్న మిథుల్, వెంకట్రావు, వెంకటేశ్వరరావు తదితరులు

న్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండ అధ్యక్షుడు భీమవరపు చిన కోటిరెడ్డి, టీడీపీ తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి వంగా సాంబిరెడ్డి, మాజీ సర్పంచ్ బొల్లు యోగానందచటర్జీ, టీడీపీ జిల్లాకార్యదర్శి కంచర్ల అమృతరాజు, టీడీపీ జనసేన, బీజేపీ నాయకులు గుడిబండి గోవర్ధనరెడ్డి, ఆళ్ళ వీరారెడ్డి, భీమవరపు వేణుగోపాల్‌రెడ్డి, ఉయ్యూరు శ్రీనివాసరెడ్డి, ఆళ్ళ సురేష్‌రెడ్డి, బొమ్ము శివారెడ్డి, కనపాల రవి, ఆళ్ళ సత్యన్నారాయణరెడ్డి, వేమూరు మోహన్‌బాబు, తుమాటి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బుర్రిపాలెంలో ప్రచారం

తెనాలి రూరల్, మే 6: కూటమి అభ్యర్థులుగా పోటీచేస్తున్న తమను గెలిపిస్తే బుర్రిపాలెం గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రజలకు మంచి జరిగేలా పాలన చేస్తామని తెనాలి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. తెలుగు జనచైతన్యయాత్రలో భాగంగా సోమవారం ఉమ్మడి పార్టీ శ్రేణులతో కలిసి మనోహర్ మండలంలోని బుర్రిపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో పర్యటిస్తూ గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలను విచారించారు. గ్రామంలో నెలకొని ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అంగలకుదురులో...

తెనాలి రూరల్, మే 6: కూటమి అభ్యర్థులను గెలిపించాలని కూటమి తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్లమనోహర్ సతీమణి మనోహరం, ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ సోదరి రాజ్యలక్ష్మిలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మండలంలోని అంగలకుదురులో ఎన్నికల బ్యాలెట్ నమూనాతో ప్రజలకు అవగాహన కల్పించారు. వారి వెంట గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నాయకులు వీరవల్లి మురళి, గ్రామ ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం, గ్రామ పార్టీ ప్రెసిడెంట్ కనగాల శ్రీనివాసరరావు పలువురు ఉమ్మడి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



బ్యాలెట్ నమూనాలను చూపుతూ ప్రచారం చేస్తున్న మనోహరం, రాజ్యలక్ష్మి, పక్కన మురళి, నాగభూషణం తదితరులు

● రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కూటమి తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న నాదెండ్ల మనోహర్ గుర్తు గాజు గ్లాసు అని ప్రజలందరూ దీనిపై అవగాహన కలిగి ఉండాలని మనోహర్ తనయుడు మిథుల్ మండలంలోని అంగలకుదురులో ప్రచారం నిర్వహించారు. కూటమి నాయకులు కరణం వెంకటేశ్వరరావు, సూర్యదేవర వెంకట్రావు, గ్రామ పార్టీ ప్రెసిడెంట్ కనగాల శ్రీనివాసరరావు తదితరులు పాల్గొన్నారు.

● తెనాలి రూరల్, మే 6: తెనాలి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న నాదెండ్ల మనోహర్ గెలుపుతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమని ఆయన తనయుడు మిథుల్ అన్నారు. సోమవారం మండలంలోని సంగం జాగర్లమూడిలో ప్రచారం నిర్వహించారు.

టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు గిరి గణేష్ ప్రచారం



ఎన్నికల ప్రచారం చేస్తున్న టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు గణేష్, తదితరులు

తెనాలి, మారీసుపేట మే 6: రానున్న ఎన్నికలలో బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల కూటమి అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు గిరి గణేష్ కోరారు. పట్టణంలో 15వ వార్డులో సోమవారం టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు గిరి గణేష్ అధ్వర్యంలో కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు.

వైసీపీ దగామాటలు నమ్మవద్దు

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, మే 6: వైసీపీ చెప్పే దగాకోరు మాటలను మరోమారు నమ్మి మోసపోవద్దని తెలుగుదేశం పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీమంత్రి, ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో హాఫ్‌పేట గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆలపాటి రాజేంద్రప్రసాద్ సమక్షంలో టీడీపీలో చేరారు. వారిని ఆలపాటి రాజేంద్రప్రసాద్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ అమరావతి రాజధానిని పునఃనిర్మాణం చేసి నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తూ అభివృద్ధి వైపు నడిపిస్తూ ప్రజలకు నిజమైన సంక్షేమాన్ని అందించగలిగే కూటమి ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో గెలిపించుకునేందుకు ప్రజలందరూ అడుగులు ముందుకు వేయాలన్నారు. ఐదేళ్లుగా రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేకపోయారని విమర్శించారు. హాఫ్‌పేట గ్రామానికి ప్రధాన రోడ్డు మార్గం అధ్వానంగా తయారై దాదాపుగా నాలుగేళ్లు కావస్తున్నా ఆ రోడ్డుకు తట్టెడు మట్టివేసి మరమ్మతులు కూడా చేయించలేకపోయిందని ఆరోపించారు. అదే విధంగా వ్యవసాయ గ్రామమైన హాఫ్‌పేటకు రైతులు పంటల సాగుకు నీరు కూడా అందించలేకపోయిందని రైతులు రోడ్డుఎక్కి నీళ్ల విడుదల చేయాలని నిరసన కార్యక్రమాలు చేపట్టే పరిస్థితి వైసీపీ ప్రభుత్వంలోనే చోటుచేసుకుందని విమర్శించారు. గ్రామాలు అభివృద్ధి చెందాలన్న అన్నదాతలు పంటలు పండించి సంతోషంగా జీవించాలన్నా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. పార్టీలో చేరిన ప్రతిఒక్కరూ ప్రజలను చైతన్యవంతులను చేసి ఉమ్మడి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కోరారు.

హెచ్‌సీవీ ఎండీ, టీడీపీ సీనియర్ నాయకుడు కరణం వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ సూర్యదేవర వెంకట్రావుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెద్దసంఖ్యలో టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.



టీడీపీలోకి చేరిన వారికి పార్టీ కండువాలతో స్వాగతం పలుకుతున్న ఆలపాటి

టీడీపీతోనే బలహీనవర్గాల అభ్యున్నతి సాధ్యం

● టీడీపీ పట్టణ అధ్యక్షుడు హరిప్రసాద్

తెనాలి రూరల్, మే 6: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి ఒక్క తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ అన్నారు. సోమవారం పట్టణంలోని 11వ వార్డు నుంచి వైసీపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారిని పట్టణ పార్టీ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. తాడేపల్లి సూర్యనారాయణ, సత్యనారాయణ, విద్యాసాగర్, చంద్రమోహన్, అల్లం లక్ష్మిల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బండ్లమూడి బాస్కర్‌రావు, రమేష్, నార్ల వెంకటరమణ, పలువురు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో హరిప్రసాద్ తదితరులు

రాష్ట్ర భవిష్యత్తు కోసం కూటమికి అండగా నిలవాలి

● టీడీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరు టౌన్, మే 6: రాష్ట్ర భవిష్యత్తు కోసం ఎన్డీఏ కూటమికి అండగా నిలవాలని పొన్నూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. సోమవారం పట్టణ ప్రధాన కూడలి ఐల్యాండ్ సెంటర్‌లో స్థానికులను కలుసుకోని ఓట్లు అభ్యర్థించారు. రేపల్లె బస్టాండ్ సెంటర్‌లో పలువురు పట్టణ వాసులు నరేంద్ర కుమార్‌ను కలిసి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు ప్రజల చేతిలోనే ఉందన్నారు. ప్రజలకు మంచిచేసే ఎన్డీఏ కూటమి అభ్యర్థులను సైకిల్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. రానున్న కూటమి ప్రభుత్వంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాముఖ్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పట్టణ ప్రధాన కూడలిలో ప్రజలతో మాట్లాడుతున్న ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌త



నంబూరులో ధూళిపాళ్ల జ్యోతిర్మయికి హారతులు పడుతున్న మహిళలు, పచ్చలతాడిపర్రు లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైదీప్తి, మార్కండేయబాబు తదితరులు

నంబూరులో జ్యోతిర్మయి విస్తృత ప్రచారం

పెదకాకాని, మే 6: సైకిల్ గుర్తుపై ఓటు వేసి పొన్నూరు నియోజకవర్గం కూటమి అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌ను, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌ను గెలిపించుకొని నంబూరు గ్రామాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లాలని ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ సతీమణి జ్యోతిర్మయి పిలుపునిచ్చారు. సోమవారం పెదకాకాని మండలం నంబూరు గ్రామంలో ఆమె ఇంటింట ప్రచార నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిర్మయి మాట్లాడుతూ.. అక్కడ రాష్ట్రం ఇక్కడ గ్రామం అభివృద్ధి చెందాలంటే ఒక తెలుగుదేశం పార్టీతోనే సాధ్యం అన్నారు. చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సూపర్ 6 పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన పార్టీల వీర మహిళలు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు.

కూటమి గెలుపుతోనే మాదిగలకు న్యాయం

పొన్నూరు టౌన్, మే 6: కూటమి పార్టీల అభ్యర్థుల గెలుపుతోనే మాదిగలకు న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మురికిపూడి హృదయరాజు అన్నారు. పట్టణ, మండలంలో సోమవారం ఎమ్మార్పీఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థులైన ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌లను గెలిపించాలని కోరారు. టీడీపీ గెలుపు మాదిగల గెలుపుగా భావించాలన్నారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల ప్రకారం కూటమి పార్టీ గెలుపుకోసం ఎమ్మార్పీఎస్ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో చేబ్రోలు అధ్యక్షుడు చిలకా నాగేశ్వరరావు, పెదకాకాని కన్వీనర్ ఎం.గురవయ్య, ఆదాం, కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కూటమితోనే సాధ్యం: వైదీప్తి

పొన్నూరు టౌన్, మే 6: రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యతో ఇబ్బందిపడుతున్న యువతకు ఉపాధి లభించాలంటే ఎన్డీఏ కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం అని ధూళిపాళ్ళ నాగసాయి వైదీప్తి అన్నారు. మండల పరిధిలోని పచ్చలతాడిపర్రులో సోమవారం జనసేన సమన్వయ కర్త వడ్రాణం మార్కండేయ బాబుతో కలిసి వైదీప్తి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారంటీ కరపత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



పొన్నూరులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



నిడుముక్కల రోడ్ షోలో మాట్లాడుతున్న ఎన్డీఏ కూటమి ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్

ధర్మం వైపు ప్రజలు నిలబడాలి

● గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్

● తాడికొండ మండలంలో ఎన్నికల ప్రచారం

తాడికొండ, మే 6: నీతి, నిజాయతీ, ధర్మం వైపు ప్రజలు నిలబడాలని ఎన్డీఏ కూటమి ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. సోమ వారం తాడికొండ మండలంలోని ముక్కామల, మోతడక, నిడుముక్కల, బడేపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్ షోను నిర్వహిం చారు. రోడ్‌షోకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ముందుగా ముక్కామల మీదుగా లచ్చనగుడిపూడి, మోతడక, నిడుముక్కల, బడేపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినిమాల టికెట్ రేట్లు తగ్గిస్తామని వారిని గుప్పిట్లో పెట్టుకున్నార న్నారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలోని ఆక్వా రైతులను భయ పెట్టారన్నారు. సర్వే రాళ్లపై పేర్లు, పాస్‌పుస్తకాలపై వాళ్ల బొమ్మలు వేసుకు న్నారు. భూములను సర్వే చేసి డేటా అంతా సేకరించి ఎవరి స్థలాలు, ఎవరి పొలాలు ఎంత ఉన్నాయో తెలుసుకున్నారు. ఇప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి స్టాంపు పేపర్లు వారి వద్ద ఉంచుకుంటారని చెప్తున్నారు. మన ఇంటి బీరువాలో ఉన్న స్టాంపు పేపర్లను నకిలీవి సృష్టించి అస్తులు అమ్ముకుంటున్న పరిస్థితి ఉందన్నారు. అధికారుల వద్ద కిరికిరి పెడితే న్యాయవ్యవస్థలు ఏమైపోవాలని.. మీరు ఎవరి దగ్గరకు వెళ్లాలని ప్రశ్నించారు. న్యాయమూర్తులుగా ఆళ్ల రామకృష్ణరెడ్డి, సజ్జల రామకృష్ణరెడ్డి, విజయసా యిరెడ్డి, మిథున్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డిలు ఒక్కొక్క జిల్లాను అప్పజెప్పి వాళ్లనే న్యాయమూర్తులు చేసి ప్రధాన న్యాయమూర్తిగా జగన్మోహన్ రెడ్డి అయిపోయిన పరిస్థితి అని విమర్శించారు. ప్రభుత్వం మారిన తరువాత అధికారులు జైళ్ల పాలయ్యే పరిస్థితి ఉందన్నారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థులుగా మేము గెలవబోతున్నామని తెలిపారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో వేసిన రోడ్లు మినహా వైసీపీ ప్రభుత్వంలో సీసీ రోడ్లు వేసిన పాపాన పోలేదన్నారు. తాగునీటి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జలజీవన్ మిషన్‌లో వేలకోట్ల రూపాయలు వాడుకోకుంటే ప్రతి ఇంటికి కుళాయి వచ్చేదన్నారు. రాజధాని లేదు, పరిశ్రమలు లేవు, ప్రతి వీధిలో గంజాయి, లిక్కర్ తీసుకువచ్చి ప్రజలను నాశనం చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత పేదలకు 2 సెంట్ల భూమిని ఇచ్చి ఇళ్లు కట్టిస్తామని చెప్పారు. కార్యక్ర మంలో మాజీ ఎమ్మెల్యే వైవీ అంజనేయులు, మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, జడ్పీటీసీ గుడిమెట్ల జ్యోతి, కంచర్ల శివరామయ్య, నీలాల కృష్ణారావు, జి.మధుసూదనరావు, జి.సాంబశిరావు, డి.శ్రీనివాసరావు, ఐ.అనిల్‌కుమార్, కె.పున్నారావు, యడ్లపల్లి సాంబశివరావు, జనసేన నియోజకవర్గ కన్వీనర్ బేతపూడి విజయ్‌శేఖర్, మండల అధ్యక్షుడు నరేష్‌కుమార్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డిని ఓడించటమే లక్ష్యం: చందు శ్రీరాములు

చేబ్రోలు, మే 6: జగన్మోహనరెడ్డిని ఓడించి ఇంటికి పంపటమే ప్రతి జనసైనికుడి లక్ష్యం అని జనసేన మండల అధ్యక్షుడు చందు శ్రీరాములు అన్నారు. సోమవారం చేబ్రోలు జనసేన కార్యాలయంలో శ్రీరాములు మాట్లాడుతూ పవన్ కల్యాణ్ వారాహి విజయభేరి బహిరంగ సభ విజయవంతం చేయటం హర్షణీయం అన్నారు. మండుటెండను లెక్కచేయకుండా అభిమానులు తరలివచ్చారన్నారు. వైసీపీని గద్దెదించే వరకు ప్రతి జనసైనికుడు అలుపెరగని పోరాటం చేస్తారని శ్రీరాములు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గట్టుపల్లి సుజిత్, శ్రీహరి, ముసలా శ్రీనివాస్, జీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ముస్తఫా, ఆయన అనుచరులపై చర్యలు తీసుకోవాలి

● రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు టీడీపీ నాయకుల ఫిర్యాదు

పెదకాకాని, మే 6: గుంటూరు ఆటోనగర్‌లో వైసీపీ అభ్యర్థి నూరి ఫాతిమా తరపున ఆమె తండ్రి ఎమ్మెల్యే ముస్తఫా, ఆయన అనుచరులు ఆటోనగర్లో టీడీపీ సానుభూతిపరులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని టీడీపీ రాష్ట్ర నాయకులు ఆరోపించారు. సోమవారం ఈ మేరకు టీడీపీ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, గుంటూరు మిర్చి యార్డ్ మాజీ చైర్మన్ మనవ సుబ్బారావులు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముఖేష్ కుమార్ మీనాను కలిసి గుంటూరు ఆటోనగర్లో వైసీపీ అక్రమాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఉద్దేశపూర్వకంగానే షాపులను తగులబెట్టారని, ఎన్నికల్లో తమకు అనుకూలంగా లేని వారిపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ దౌర్జన్యాలు ఇలాగే కొనసాగితే ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోలేరని, శాంతిభద్రతలను పరిరక్షించేలా ఈ ఘటనపై సమగ్ర విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

శంకర కంటి ఆస్పత్రి పీఆర్వో సురేష్ హఠాన్మరణం

● నివాళులర్పించిన డాక్టర్ శివాజీ, కరుణ చంద్రబాబు



లంకా సురేష్ (ఫైల్ ఫొటో)

పెదకాకాని, మే 6: పెదకాకాని శంకర కంటి ఆస్పత్రి పీఆర్వోగా పని చేస్తున్న లంకా సురేష్ (62) హఠాన్మరణం చెందారు. అకస్మాత్తుగా ఆయన అనారోగ్యానికి గురై విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం కన్నుమూశారు. పెదకాకాని శంకర కంటి ఆస్పత్రిలో పీఆర్వోగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన ఎవరైనా చనిపోతే వారి కుటుంబ సభ్యుల అనుమతి మేరకు వారి కళ్లను డొనేట్ చేయించి ఎందరికో చూపునిచ్చారు. శంకర కంటి ఆస్పత్రికి ఆయన విస్తృతంగా సేవలందించారు. ఆయన తండ్రి లంకా సూర్యనారాయణ గుంటూరు బృందావన్‌గార్డెన్స్‌లోని అన్నమయ్య గ్రంథాలయ వ్యవస్థాపకులుగా పనిచేస్తున్నారు. రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ, మున్సిపల్ మాజీ కమిషనర్ దేవినేని కరుణచంద్రబాబు, విశ్రాంత జడ్జి జీకే శంకర్ తదితరులు సురేష్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన అంత్యక్రియలు గుజ్జనగుండ్లలోని మహాప్రస్థానంలో సోమవారం ముగిశాయి.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

తెనాలి అర్బన్, మే 6: అరటి పండ్ల దుకాణంలో పనిచేసే వ్యక్తి అనుమానాస్పద మృతిపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. బాపట్ల జిల్లా పొదిలికి చెందిన పాలపర్తి సురేష్ తన భార్య పిల్లలతో కలిసి 12 ఏళ్ల క్రితం పనుల కోసం తెనాలి వచ్చి కాపురం ఉంటున్నాడు. గంగానమ్మపేటలో అరటి పండ్ల దుకాణంలో పని చేస్తున్నాడు. అతనికి మద్యం అలవాటు ఉంది. ఈ నెల 3న రాత్రి సమయంలో దెబ్బలతో పడిపోయి ఉన్నాడు. కుటుంబ సభ్యులు ఇంటికి రాలేదని వెతుకుతూ వచ్చి గాయపడిన అతనిని ప్రభుత్వ వైద్యశాలలో చేర్చారు. చికిత్స పొందుతూ ఈ నెల 4న మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

15 నుంచి సాక్షిభావనారాయణస్వామి బ్రహోత్సవాలు

పొన్నూరు టౌన్, మే 6: ఈ నెల 15వ తేదీ నుంచి సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీసాక్షి భావనారాయణస్వామి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు జరగనున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మండేపూడి పానకాలరావు తెలిపారు. సోమవారం బ్రహ్మోత్సవాల ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. 15న ఉత్సవాలకు అంకురార్పణ చేసి ధ్వజారోహణం చేయనున్నట్లు చెప్పారు. 16న పెండ్లి కుమారుని ఉత్సవం, శేషవాహన సేవ, 17న సరస్వతి అలంకరణలో హంసవాహన సేవ, 18న రామావతారంలో హనుమత్ వాహనసేవ, 19న సింహవాహన సేవ, 20న రాజాధిరాజ వాహన సేవ, 21న కృష్ణుడి అలంకరణలో పొన్నవృక్ష వాహన సేవ, 22న స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవం, గజవాహన సేవ, గరుడ వాహన సేవలు నిర్వహించనున్నారు. ఆలయ అనువంశీకర్త ధర్మకర్త రాజావాసిరెడ్డి సుధాస్వరూప్ బహద్దూర్ మన్నెసుల్తాన్ దొర పర్యవేక్షణలో 23వ తేదీన స్వామి వారి దివ్య రథోత్సవం నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. 24న వసంతోత్సవం, ధ్వజావరోహణం, హయవాహన సేవ, 25న తెపోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నట్లు తెలిపారు.